ప్రజాశక్తి

మంగళవారం 24 జూన్ 2025 8 పేజీలు





ప్రకాశం బాపట్ల



యువత పోరు ర్యాలీలో వైసిపి నాయకులు

యువతకు
చంద్రబాబు వెన్నుపోటు

- హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం
- యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఉత్తుత్తి హామీలతో గద్దెనెక్కిన చంద్రబాబు నాయుడు ఏడాది పాలనలో ఏ ఒక్క హామీనీ నెరవేర్చకుండా విద్యార్థులను, యువతను వెన్ను పోటు పొడిచారని యర్రగొండపాలెం శాసన సభ్యులు తాటిపర్తి చంద్రశేఖర్ ఆరోపించారు. సోమవారం నాడు వైసీపీ చేపట్టిన యువత పోరులో భాగంగా స్థానిక అంబేద్కర్ భవనం వద్ద జరిగిన సభలో ఎమ్మెల్యే తాటిపర్తి మాట్లాడారు. రాష్ట్రంలో లక్షలాది ఉద్యోగాలు అందిస్తామని, ఉద్యోగం వచ్చేంతవరకు నెలకు మూడు వేల రూపాయలు చొప్పున నిరుద్యోగ భృతి కల్పిస్తామని ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని దుయ్యబట్టారు. నిరుద్యోగ భృతి ఇవ్వడానికి ఖజానాలో డబ్బులు లేవని చెప్పే ఈ పెద్ద మనిషికి కొడుకు కోసం హెలికాప్టర్ కొనడానికి డబ్బులు ఎక్కడి నుంచి వచ్చాయో చెప్పాలని ప్రశ్నించారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ మెప్పు పొందటం కోసం ఒక్కరోజులో రూ.350 కోట్లు ఖర్చు పెట్టి యోగాంధ్ర నిర్వహించారని, దీనికి డబ్బులు ఎక్కడ నుంచి వచ్చాయో చెప్పాలని నిలదీశారు. ఏడాదికి 20 లక్షల ఉద్యోగాలు ఇస్తానని చెప్పిన చంద్రబాబు అధికారంలోకి రాగానే 4 లక్షల మందిని ఉద్యోగం లోంచి పీకేశారని తెలిపారు. రేషన్ పంపిణీ వాహనాల్లో పనిచేసే 20 వేల మందిని, బేవరైజెస్ కార్పొరేషన్లో పనిచేసే 15 వేల మందిని, లక్షల మంది వలంటీర్లను, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లను ▶ 2లో



మాట్లాడుతున్న నారా లోకేష్

నిరుద్యోగులందరికీ
ఉద్యోగాలు ఇస్తాం..

- కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం..
- సైనిక స్కూల్‌తో మంచి ఉద్యోగ అవకాశాలు
- స్కూల్ ప్రారంభోత్సవంలో మంత్రి నారా లోకేష్

ప్రజాశక్తి-ఇంకొల్లు, బాపట్ల జిల్లా

రాబోయే కాలంలో నిరుద్యోగులందరికీ ఉద్యోగం, ఉపాధి కల్పించే లక్ష్యంగా ముఖ్యమంత్రి పనిచేస్తున్నారని, రాష్ట్రానికి అనేక కంపెనీలు, పెట్టుబడులను తీసుకొచ్చే విధంగా కృషి చేస్తున్నామని రాష్ట్ర ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన సంవత్సర కాలంలోనే అనేక అభివద్ధి కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు. సోమవారం ఇంకొల్లులోని గంగవరం ▶ 2లో



సైనిక స్కూల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి నారా లోకేష్

అంగన్‌వాడీలకు
సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి

- కలెక్టరేట్ వద్ద ధర్నా
- పీడీ కార్యాలయం గేటు వద్ద బైఠాయింపు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ



ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

అంగన్‌వాడీలకు తల్లికి వందనంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలుచేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం నాడు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. అంగన్వాడి వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు కెవి. సుబ్బమ్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదర అన్నపూర్ణ మాట్లాడారు. అంగన్వాడీల ఆధార్ సీడింగ్‌లో రికార్డు చేసిన ఉద్యోగి పదాన్ని తొలగించి అంగన్వాడీలందరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు పరచాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ పద్ధతిన చాలీచాలని జీతాలతో కుటుంబాలను పోషించుకుంటున్న తమను ఆధార్ ప్రకారం ఉద్యోగులుగా ప్రకటించి సంక్షేమ పథకాలు అందకుండా చేయడం తగదన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తే ఉద్యోగులకు అమలు చేస్తున్న పిఆర్సి, (పే స్కేల్), ఇతర బెనిఫిట్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీల హాజరుకు నిర్దేశించిన ఎఫ్ఆర్ఎస్ యాప్ రద్దు చేయాలని, కొత్త ట్యాబ్లు ఇవ్వాలని, అలాగే ఐదు సంవత్సరాల లోపు పిల్లలందరూ అంగన్వాడీ కేంద్రాలలో ఉండేలాగా ప్రభుత్వం చట్టం చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, పని భారాన్ని తగ్గించాలని కోరారు. మినీ కార్యకర్తల జీవోను మెయిన్ అంగన్వాడీలుగా మారుస్తూ జీవో వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు, సిఐటియు ఉపాధ్యక్షులు జివి.కొండారెడ్డి, అంగన్వాడి యూనియన్ గౌరవాధ్యక్షులు ఎం రమేష్ మాట్లాడుతూ అంగన్వాడీల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం 42 రోజులు సమ్మె సందర్భంగా ఇప్పుడు అధికారంలో ఉన్న టిడిపి నాయకులందరూ సమస్యలు పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారని, ఆ హామీలు నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ అంగన్వాడీలకు వర్తింపజేయాలని కోరారు. సమావేశంలో ▶ 2లో

వీరయ్య హత్య కేసు నిందితులు
పోలీసు కస్టడీకి..

3 రోజుల పాటు విచారించనున్న పోలీసులు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

టిడిపి నాయకులు, నాగులుప్పలపాడు మాజీ ఎంపిపి ముప్పవరపు వీరయ్యచౌదరి హత్య కేసులో నలుగురు నిందితులను 3 రోజుల పాటు పోలీస్ కస్టడీకి కోర్టు అనుమతినిచ్చింది. ముప్పవరపు వీరయ్యచౌదరి హత్య కేసు విచారణలో భాగంగా పూర్తిస్థాయి సమాచారం రాలేదని, కేసును సమగ్రంగా విచారించేందుకు నిందితులను పోలీస్ కస్టడీకి అనుమతించాలని కోరుతూ ఒంగోలు తాలూకా పోలీసులు కోర్టులో పిటీషన్ వేశారు. దీంతో హత్య కేసులో నిందితులైన బూర్ల వినోద్‌కుమార్, ఆళ్ళ సాంబశివరావు, గోళ్ళ రుతేంద్రబాబు, ఓబిలి నాగరాజును 3 రోజుల పాటు పోలీస్ కస్టడీకి కోర్టు అనుమతి ఇచ్చింది. హత్య కేసులో నిందితులను మంగళ, బుధ, గురువారాలలో పోలీసులు విచారించనున్నారు.

నిరుద్యోగులందరికీ
ఉద్యోగాలు ఇస్తాం..

(మొదటిపేజీ తరువాయి)

రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన డివిఆర్ సైనిక స్కూల్ ప్రారంభోత్సవం సందర్భంగా జరిగిన సభలో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. గ్రామీణ ప్రాంతంలో ఏర్పాటు చేసిన డివిఆర్ సైనిక స్కూల్లో చదువుకున్న విద్యార్థులకు దేశ రక్షణ రంగాల్లో అధికార స్థాయి హోదాలో ఉండే ఉద్యోగాలు లభించే అవకాశం ఉందని చెప్పారు. దేశ రక్షణ వ్యవస్థలో ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ దళాలు ముఖ్యమైనవని, వాటిలో ఉన్నత ఉద్యోగాలు సాధించాలంటే ఇలాంటి సైనిక స్కూలు ఉపయోగపడుతుందని చెప్పారు. రాష్ట్రంలో ఈ సైనిక స్కూల్ రెండవదని, దీని ప్రారంభోత్సవానికి తాను వచ్చినందుకు సంతోషం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖలో తీసుకొచ్చిన గణనీయమైన సంస్కరణలను భారతదేశమే కాక ప్రపంచమంతా మన రాష్ట్రం వైపు చూసే విధంగా అత్యున్నత స్థానంలో నిలుపుతున్నామని చెప్పారు.

ముఖ్యంగా ఉమ్మడి ప్రకాశం జిల్లాకు సంబంధించి ముగ్గురు ప్రధానమైన నాయకులు ఏలూరి సాంబశివరావు, గొట్టిపాటి రవికుమార్, డోలా బాలవీరాంజనేయస్వామి గురించి చెబుతూ గత పాలకవర్గంలో అసెంబ్లీలో అమరావతిపై చర్చ జరిగినప్పుడు గత వైసిపి పాలకులు చేసేటువంటి ఆందోళన అడ్డుకొని అప్పటి మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి అండగా నిలబడ్డారని వారిని అభినందించారు.

డివిఆర్ సైనిక స్కూల్ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ దగ్గుబాటి హితేష్ చెంచురామ్ మాట్లాడుతూ విద్యార్థులను దేశ రక్షణ శాఖలో కీలకమైన అధికార హెూదాలో ఉండే విధంగా తయారు చేయడమే తమ పాఠశాల ఉద్దేశమని తెలిపారు.

డివిఆర్ స్కూలు ప్రెసిడెంట్ మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తమ తండ్రి చెంచురామయ్య కాలంలోనే ఇంకొల్లు ప్రాంతంలో డీసీఆర్ఎం విద్యాసంస్థల స్థాపించామని, అలాగే ప్రస్తుతం ఈ సైనిక స్కూల్ ఏర్పాటు చేశామని చెప్పారు. దీంట్లో చదివినటువంటి విద్యార్థులు సైనిక రంగంలో ఉన్నత ఉద్యోగాలతో పాటు నేషనల్ డిఫెన్స్ అకాడమీలో కూడా అవకాశాలు వస్తాయని అందరూ వినియోగించుకోవాలని సూచించారు.

విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ పర్చూరు ప్రాంతంలో పొగాకు రైతులకు అండగా ప్రభుత్వం నిలిచిందని, అలాగే ఇతర ప్రాంతాల్లో కూడా మామిడి తదితర ఇతర పంటలను వేసి ఇబ్బంది పడుతున్న రైతాంగానికి కూడా ప్రభుత్వం అండగా నిలుస్తుందని చెప్పారు.

మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రాన్ని ఒక విద్యా హబ్‌గా తీర్చిదిద్దడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేష్ కషి చేస్తున్నారని చెప్పారు.

స్థానిక శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు మాట్లాడుతూ పర్చూరు నియోజకవర్గం అంతా గ్రామీణ ప్రాంతమని, ఈ ప్రాంతాల్లో మంచి విద్యాభివద్ధికి కషి చేస్తున్న దగ్గుబాటి దంపతులకు అభినందనలు తెలిపారు. పర్చూరు నియోజకవర్గంలో పొగాకు రైతులు అందరికీ ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం వైపు నుంచి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురంధరేశ్వరి మాట్లాడుతూ దేశ భవిష్యత్తు-పిల్లల భవిష్యత్తు అన్నీ పాఠశాలలోనే తీర్చిదిద్దబడతాయని చెప్పారు. గ్రామీణ ప్రాంతంలో ఉన్నత విద్య అందించడమే తమ లక్ష్యమని వివరించారు.

కార్యక్రమానికి సైనిక స్కూల్ ప్రిన్సిపల్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ జె వెంకట మురళి, ఎస్పీ తుషార్‌డూడి, స్కూలు కోఆర్డినేటర్ గోరంట్ల సుబ్బారావు, పాఠశాల విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గంగవరంలో లోకేష్‌కు ఘన స్వాగతం

మంగళగిరి నుంచి గుంటూరు, చిలకలూరిపేట మార్టూరు జాతీయ రహదారి మీదుగా ఇసుక దర్శి వద్ద ఉన్న ఏలూరి సాంబశివరావు క్యాం కార్యాలయానికి ముందుగా లోకేష్ చేరుకున్నారు. అక్కడ అల్పాహారం అనంతరం ర్యాలీగా ముప్పవరం, పంగులూరు, ఆరికట్లవారిపాలెం గ్రామాల మీదుగా ర్యాలీగా గంగవరం గ్రామానికి చేరుకున్న లోకేష్‌కు అక్కడ మహిళలు, టిడిపి కార్యకర్తలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. లోకేష్ శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావుతో కలిసి వాహనం ఫుట్‌పాత్‌పై నిలబడి యువకులతో కరాచలనం చేస్తూ ముందుకు సాగారు. పొగాకు రైతులు గజమాలతో వీరిని సత్కరించారు. గంగవరంలో విద్యార్థులతో లోకేష్ ముచ్చటించారు. సమస్యలపై ప్రజలు ఇచ్చిన అర్జీలను స్వీకరించారు.

ప్రతి నెలా ఐదు రోజుల ముందే..
వృద్ధుల ఇంటికి రేషన్ సరుకులు



తహశీల్దార్ మంజునాథరెడ్డి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ప్రభుత్వం అందిస్తున్న సామాజిక భద్రత పథకాలలో భాగంగా వృద్ధులకు ప్రతి నెలా ఐదు రోజుల ముందే రేషన్ సరుకులు ఇళ్లకే పంపిణీ చేస్తున్నట్లు యర్రగొండపాలెం తహశీల్దార్ డి మంజునాథరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేసిన తాజా మార్గదర్శకాల ప్రకారం వృద్ధులకు రేషన్ సరుకులను ప్రతి నెలా ఐదు రోజుల ముందుగానే వారి నివాసాలకు చేరవేస్తున్నట్లు తెలిపారు. వృద్ధులు తాము రేషన్ దుకాణాలకు రావాల్సిన అవసరం లేకుండా, వారి ఇంటికే వెళ్లి రేషన్ సరుకులను అందజేయనున్నట్లు తెలిపారు. ఈ విధానం వారికి సౌకర్యంగా ఉండటమే కాకుండా, ఆరోగ్యపరమైన ఇబ్బందులు తలెత్తకుండా నివారించగలగడం గర్వకారణమని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాలను అనుసరిస్తూ మండలంలోని ప్రతి గ్రామంలో ఈ ప్రక్రియను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని వివరించారు. ప్రతి నెలా 1వ తేదీకి ముందే రేషన్ సరుకుల పంపిణీ పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ ప్రక్రియలో లోటుపాట్లు లేకుండా పక్కాగా పర్యవేక్షణ చేపడుతున్నామని, ఏవైనా సమస్యలు ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

పెరిగిన ఎండోమెంట్ కౌలు వేలం ధరలు

ప్రజాశక్తి-సంతనూతలపాడు

సంతనూతలపాడులోని చెన్నకేశవస్వామి, త్రిపురాంతక స్వామి ఆలయాలలో సోమవారం జరిగిన ఎండోమెంట్ భూముల కౌలు వేలం పాటలలో రైతులు పోటీ పడడంతో పాటలు పెరిగిపోయాయి. గతంలో ఈ భూములకు సంబంధించి రూ.12,65,000 కౌలు వేలం లభించగా నేడు రూ.14,85,000 కు పెరిగాయి. మూడు సంవత్సరాల పాటు కౌలు వేలం పాటలను నిర్వహించారు. ఈ ఏడాది రు.2,20,000 ఆయా భూములకు పాటల్లో కౌలు పెరిగినది. ఎండోమెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎన్ నారాయణరెడ్డి పర్యవేక్షణలో ఈ భూములకు కౌలు వేలం పాటలను నిర్వహించారు. చెన్నకేశవస్వామి దేవస్థానానికి సంబంధించి వీర్ల వారి కుంట బొడ్డువారిపాలెం గ్రామ పరిధిలోని సుమారు 8 ఎకరాలకు కౌలు వేలం పాటలను నిర్వహించగా రూ.2,77,000 పలికింది. సంతనూతలపాడులోని చెన్నకేశవ స్వామి దేవస్థానానికి సంబంధించి మైనంపాడు, బొడ్డువారిపాలెం, చంద్రపాలెం, గుడిపాడు, గురవారెడ్డిపాలెం గ్రామాల పరిధిలో 30 ఎకరాల 74 సెంట్లు భూములకు రూ.5,94,000 పలికింది. సంతనూతలపాడు త్రిపురాంతక స్వామి దేవస్థానానికి సంబంధించి బొడ్డువారిపాలెం, గురువారెడ్డిపాలెం, చంద్రపాలెం గుడిపాడు, సంతనూతలపాడు, గ్రామాల పరిధిలో గల 66 ఎకరాలకు రు.6,14,000 కౌలు వేలం పాటలలో పలికినవి. రైతులు పోటా పోటీగా పాల్గొన్నారు. ఈ కౌలు వేలం పాటలను సంతనూతలపాడు ఎండోమెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎన్ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో సంతనూతలపాడులోని చెన్నకేశవ, త్రిపురాంతక స్వామి వారి ఆలయాల్లో ఈ కౌలు వేలం పాటలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కరువాది గ్రూప్ టెంపుల్స్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వి శ్రీనివాసబాబు, ఎండోమెంట్ శాఖ ఉద్యోగులు పి రవీంద్రబాబు, పి మురళీకృష్ణ, కే శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు 'సంక్షేమం' వర్తింపజేయాలి

(మొదటిపేజీ తరువాయి)

ప్రాజెక్టుల కార్యదర్శులు సుజాత, ఎల్లమ్మ తిరుపతమ్మ మాట్లాడారు. అనంతరం డిఆర్ఓ ఓబులేసుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం అంగన్వాడీలు వినతిపత్రం అందజేసేందుకు పీడీ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి ప్రాజెక్టు డైరెక్టర్ సువర్ణకు వినతిపత్రం అందజేసే ప్రయత్నం చేయగా, ఆమె నిరాకరించడంతో కార్యాలయం గేట్ వద్ద నిరసన చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు చొరవ తీసుకుని పీడీతో చర్చించి సమస్యలపై చర్చలు జరిపించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బంకా సుబ్బారావు, మెడికల్ అండ్ హెల్త్ మెడికల్ రిప్స్ రాష్ట్ర నాయకులు చిరంజీవి అంగన్వాడీలకు సంఘీభావం వ్యక్తం చేశారు.

యువతకు చంద్రబాబు వెన్నుపోటు

(మొదటిపేజీ తరువాయి)

ఉద్యోగాల నుంచి తొలగించి నిరుద్యోగులుగా రోడ్లమీద పడవేశారని విమర్శించారు. మాజీ సిఎం జగన్ పొగాకు రైతులను పరామర్శించడానికి వస్తే మహిళలతో నిరసనలు చేయించి గొడవలు సష్టించారని, వైసిపి కార్యకర్తల పైనే కేసులు బనాయించారని ఆరోపించారు.

వైసిపి మార్కాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం నియంతృత్వంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రజలకు అండగా పోరాటాలు నిర్వహిస్తోన్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు మీద తప్పుడు కేసులు బనాయించేందుకు ప్రభుత్వం వెనకాడటం లేదని, ఇది మంచి పద్ధతి కాదని హితవు పలికారు. కార్యక్రమంలో ఒంగోలు వైసీపీ ఇంచార్జ్ చుండూరి రవి బాబు, కనిగిరి ఇన్‌ఛార్జి దద్దాల నారాయణ యాదవ్ మాట్లాడారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు కటారి శంకర్, జిల్లా యూత్ అధ్యక్షులు గొంగటి శ్రీకాంత్ రెడ్డి, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షులు పల్నాటి రవీంద్ర రెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలు దుంపా రమణమ్మ, జిల్లా బిసి సెల్ అధ్యక్షులు బొట్ల సుబ్బారావు, రాష్ట్ర కార్యదర్శి కేవీ రమణారెడ్డి, వై. వెంకటేశ్వర్లు నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, మహిళలు పాల్గొన్నారు.

ఏవోగా శివగంగ ప్రసాద్



ప్రజాశక్తి-అర్ధవీడు: అర్ధవీడు మండల వ్యవసాయ అధికారిగా జి శివగంగప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని రైతులకు అందుబాటులో ఉంటూ తగు సూచనలు సలహాలు ఇస్తానని తెలియజేశారు. ప్రస్తుతం అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో ఈకేవైసీ చేయించుకోవాలని రైతులను కోరారు. అదేవిధంగా మండలంలోని కౌలు రైతులు కౌలు కార్డులు తప్పనిసరిగా తీసుకోవాలని తెలియజేశారు.

చోరీ కేసులో నిందితుడు అరెస్టు

31 గ్రాముల బంగారం స్వాధీనం

ప్రజాశక్తి- చీమకుర్తి

చీమకుర్తిలోని వీవర్స్ కాలనీ రెండో లైన్‌లో నివాసముంటున్న గోలి పద్మజపై ఈనెల 15న ఓ వ్యక్తి దాడి చేసి ఆమె బంగారు గొలుసు లాక్కుని వెళ్లిన విషయం తెలిసిందే. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా పోలీసులు సోమవారం నిందితుడిని పట్టుకున్నారు. అతని వద్ద నుంచి 31 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకొని బాధితురాలికి అందజేశారు. పోలీసుల కథనం ప్రకారం.... శ్రీకాకుళం జిల్లా పురుషోత్తమ నగర్ కు చెందిన పెడదా శివ అనే వ్యక్తి కాషాయ దుస్తులు ధరించి పద్మజ ఇంట్లోకి చొరబడ్డాడు. ఆమె ఒంటరిగా ఉండటానికి చూసి ఆమెపై రుబ్బురోలు బండతో దాడి చేసి గాయపరిచాడు. అనంతరం ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసును లాక్కొని పరారయ్యాడు.



పోలీసుల అదుపులో ఉన్న నిందితుడు

బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేర ప్రకారం జిల్లా ఎస్పీ ఆదేశాల మీద పోలీసులు నాలుగు టీములుగా ఉమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. వివిధ రకాల సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి త్రోవగుంట సమీపంలో నిందితుడు పెడదా శివ ను సోమవారం అదుపులో తీసుకొని కోర్టుకు హాజరు పరిచారు. ఒంగోలు డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావు, చీమకుర్తి సిఐ సుబ్బారావు ఆధ్వర్యంలో నాలుగు పోలీసు బందాలు చోరీ కేసును ఛేధించేందుకు విశేష కృషి చేశారు. చోరీ కేసు ఛేధించేందుకు సహకరించిన ఒంగోలు వన్ టౌన్ పోలీస్ సిబ్బంది శివారెడ్డి, కొండయ్య, దస్తగిరి, చీమకుర్తి ఎఎస్ఐ శ్రీనివాసులు రెడ్డి, కానిస్టేబుల్ అనీల్ మరియు సిబ్బందిని ఎస్‌పి అభినందించారు.



ఎస్ఐను సన్మానిస్తున్న టిడిపి నాయకులు

ఎస్ఐ చంద్రశేఖర్‌కు సన్మానం

ప్రజాశక్తి-సిఎస్.పురం

సిఎస్‌పురం ఎస్ఐగా చంద్రశేఖర్ ఇటీవల విధుల్లో స్వీకరించారు. అందులో భాగంగా టిడిపి నాయకులు ఎస్ఐను సోమవారం కలిసి అభినందనలు తెలిపారు. శాలువ కప్పి పూలమాలలతో సత్కరించారు. ఎస్ఐకు అభినందనలు తెలిపిన వారిలో దాసరి మల్లికార్జున, ఆనికాళ్ళపల్లి డీలర్ మునగల వెంకటేశ్వర్‌రెడ్డి, దర్శి ఆదినారాయణ, రామిశెట్టి మాల్యాద్రి, ధనెంకుల వెంకటేశ్వర్లు, కందేర నాగేశ్వరరావు, ధనెంకెకుల పోలయ్య, దర్శి వీరభిక్షం, చల్లగండ్ల ఏసోబ్, పులి జేమ్స్ తదితరులు ఉన్నారు.

పొగాకు బేళ్ల అమ్మకం

ప్రజాశక్తి-టంగుటూరు

మండెలలో మగ్గిన పొగాకును రైతులు బేళ్లు కట్టుకొని అమ్మకానికి తీసుకురావాలని టంగుటూరు వేలం నిర్వహణాధికారి అట్లూరి శ్రీనివాసరావు తెలిపారు. పొగాకు బేళ్లను వేలానికి తీసుకొచ్చేటప్పుడు తేమ, తడి లేకుండా చూసుకోవాలన్నారు. టంగుటూరు పొగాకు వేలం కేంద్రానికి వేలం కేంద్రానికి ఎం. నిడమానూరు గ్రామానికి చెందిన రైతులు 958 బేళ్లను అమ్మకానికి తెచ్చారు. అందులో 751 బేళ్ల అమ్ముడు పోయాయి. వివిధ కారణాల చేత 207 బేళ్ల తిరస్కరించారు. కిలో పొగాకు అత్యధిక రూ.280, అత్యల్ప ధర రూ.180, సరాసరి ధర రూ. 239-34 పైసలు పలికింది. వేలంలో 15 కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

కొండపి : కొండపి పొగాకు వేలంలో సోమవారం కిలో పొగాకు కనిష్ఠ ధర రూ. 185 పలికినట్లు వేలం నిర్వహణ అధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు. క్లస్టర్ పరిధిలోని గోగినేని వారిపాలెం, అక్కచెరువుపాలెం,పైడిపాడు గ్రామాలకు చెందిన రైతులు 1.024 బేళ్లను అమ్మకానికి తెచ్చారు. అందులో 732 బేళ్ల అమ్ముడు పోయాయి. వివిధ కారణాల చేత 287 బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ. 280, సరాసరి ధర కేజీ రూ 248.23 పైసలు పలికింది. వేలంలో 24 కంపెనీలు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

కౌలు కార్డుల ప్రక్రియ ప్రారంభం

ప్రజాశక్తి- పిసిపల్లి

కౌలు కార్డుల ప్రక్రియను ప్రారంభించినట్లు మురుగమ్మి సచివాలయ వ్యవసాయ శాఖ సహాయకురాలు పి.సాయి ప్రియ తెలిపారు. 2025- 2026 సంవత్సరానికి కౌలుకు భూమిని తీసుకొని సాగు చేస్తున్న రైతులకు కౌలు గుర్తింపు కార్డులు విఆర్ఒలకు ద్వారా ఇవ్వనున్నట్లు ఆమె తెలిపారు. సాగు చేసున్న పొలం యజమాని భూమి పాస్ పుస్తకం జెరాక్స్, ఆధార్ కార్డు జెరాక్స్, కౌలు రైతు ఆధార్ కార్డు జెరాక్స్, మొబైల్ నెంబరు, కౌలు రైతు పాస్ ఫొటోతో విఆర్ఒను సంప్రదించి కౌలు కార్డులు పొందాలని తెలిపారు. మురుగుమ్మి సచివాలయం పరిధిలోని మురుగుమ్మి ,జంగాలపల్లి మారెళ్ళ, రామ గోవిందపురం కౌలు రైతులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు.

తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి-చీమకుర్తి : చీమకుర్తి రామనగర్ మెయిన్ బజార్లో బైపాస్ రోడ్డు సమీపంలో రోడ్డు ఉన్న ఓ విద్యుత్తు స్తంభాన్ని ట్రాలీ సోమవారం ఢీకొంది. దీంతో స్తంభం విరిగిపడింది. ఆ సమయంలో ఆ రహదారిపై ప్రజల లేక పోవడంతో ప్రమాదం తప్పింది. అందిన వివరాల ప్రకారం.. డ్రైవర్ ట్రాలీని నిర్లక్ష్యంగా నడుపుతూ విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్నాడు. దీంతో స్తంభం విరిగి రోడ్డు మీద పడకుండా మరోవైపు పడింది. ఈ విషయాన్ని గమనించిన మహిళలు భయాందోళన గుర్తై పరుగులు తీశారు. అదే లైన్‌లో నాలుగైదు విద్యుత్ స్తంభాలు ఒరిగాయి. ఆ సమయంలో ట్రాలీ నడుపుతున్న డ్రైవరు మద్యం మత్తులో ఉన్నట్లు తెలిసింది.

గ్రామాభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకం

ఎంపిపి దంతులూరి ప్రకాశం

ప్రజాశక్తి- కనిగిరి

గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకమని ఎంపిపి దంతులూరి ప్రకాశం, ఎంపిడిఒ ప్రభాకర్ శర్మ తెలిపారు. కనిగిరి డివిజన్ పరిధిలోని మహిళా సర్పంచులకు శిక్షణా తరగతులు సోమవారం ప్రారంభించారు. ఈ శిక్షణా తరగతులకు దర్శి, దొనకొండ, కొనకనమిట్ల, చంద్రశేఖరపురం మండలాలకు చెందిన మహిళా సర్పంచులు హాజరయాయరు. తొలుత ఎంపిపి దంతులూరి ప్రకాశం అధికారులు, మహిళ సర్పంచులతో కలిసి గాంధీజీ, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎంపిపి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారని తెలిపారు. గ్రామస్థాయిలో మహిళా సర్పంచులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకొని



నివాళులర్పిస్తున్న ఎంపిపి

గ్రామాల అభివద్ధిలో కీలక భూమిక పోషించేందుకు ఈ శిక్షణ తరగతులు ఎంతగానో ఉపకరిస్తాయని తెలిపారు. గ్రామాలలో అభివద్ధికి మహిళా సర్పంచులు నిర్వహించాల్సిన బాధ్యతలు, విధుల గురించి ట్రైనింగ్ అధికారులు సుజాత, రఘుబాబు, మల్లేశ్వరి, ఏడుకొండలు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలికి జాతీయ విద్యారత్న అవార్డు

ప్రజాశక్తి-టంగుటూరు

జరుగుమల్లి మండలం నందనవనం ఎస్‌సి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్న రజనీని జాతీయ విద్యారత్న అవార్డు వరించింది. చత్తీస్‌ఘడ్ కేంద్రంగా నిర్వహిస్తున్న నవాచారి గతి విద్యాలయ్ సమూహ్ గ్రూపు వారు అవార్డు అందజేశారు. 2024-25 ఏడాదికి గాను ప్రకటించిన అవార్డుల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి 9 మందిని ఎంపిక చేశారు. అందులో జరుగుమల్లి మండలం నందనవనం ఎస్‌పి ప్రాథమిక



అవార్డుతో రజనీ

పాఠశాల ఉపాధ్యాయు రాలు రజనీకి చోటు దక్కడం విశేషం. విద్యార్థులకు వినూత్నమైన, సత్ఫలితాలను ఇచ్చే రీతిలో పాఠాలను బోధిస్తున్న ఉపాధ్యాయులకు నవాచారి గతి విద్యాలయ సంస్థ వారు ప్రతి ఏటా అవార్డులు అందజేస్తున్నారు. అందులో భాగంగా సర్టిఫికెట్, మెమొంట్ ,పెన్నును స్పీడ్ పోస్ట్ రజనీకి పంపారు. ఈ సందర్భంగా అవార్డు అందుకున్న రజనీని సహోపాధ్యాయులు అభినందించారు.

నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు : గఫార్

ప్రజాశక్తి- కనిగిరి

ప్రజలకు నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అన్నారు.కనిగిరి పట్టణంలోని 8వ వార్డులో ట్యాంకర్ల ద్వారా కొనసాగుతున్న నీటి సరఫరాను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గఫార్ మాట్లాడుతూ ప్రజలకు నీటి సమస్య తలెత్తకుండా ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. పట్టణంలో ఎక్కడైనా నీటి ఎద్దడి తలెత్తితే వెంటనే సచివాలయ సిబ్బందిదృష్టికి తీసుకురావాలని ప్రజలకు తెలిపారు.ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, వార్డు



సమస్యలు తెలుసుకుంటున్న మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్

ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు

ప్రజాశక్తి -చీమకుర్తి

మండల పరిధిలోని బండ్లమూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి మురారి హేమంత్ కుమార్ నూజివీడు ట్రిపుల్ ఐటి కళాశాలలో సాధించాడు. అదేవిధంగా పల్లామల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు వి.రాజ్యలక్ష్మి నూజివీడు, డివివి. పూజిత ఒంగోలులో ట్రిపుల్ ఐటి కళాశాలలో సీట్లు సాధించారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థులను ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.



నాగేశ్వరరావును సన్మానిస్తున్న సేవా సంస్థ ప్రతినిధులు

డాక్టర్ నాగేశ్వరరావుకు సన్మానం

ప్రజాశక్తి-టంగుటూరు : టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిగా డాక్టర్ నాగేశ్వరరావు సోమవారం విధుల్లో చేరారు. ఆయన నాలుగులపప్పాడు మండలం అమ్మనబ్రోలు ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగేశ్వరరావును స్ఫూర్తి స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు, వైద్య సిబ్బంది శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, స్ఫూర్తి సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



భవ్యశ్రీని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ లక్ష్మణరావు

శ్రీచైతన్య టెక్నో విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి-శింగరాయకొండ : శింగరాయకొండలోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్‌లో 7వ తరగతి చదువుతున్న దేవినేని భవ్యశ్రీ అనే విద్యార్థిని భారత్ అకాడమీ హైదరాబాద్ తరపున నిర్వహించిన ది లార్జెస్ట్ కూచిపూడి నత్యంలో పాల్గొని వరల్డ్ గిన్నిస్ రికార్డులో తన పేరును నమోదు చేసుకున్నట్లు శ్రీచైతన్య టెక్నో స్కూల్ ప్రిన్సిపాల్ బి.లక్ష్మణ్ తెలిపారు. ఈ సందర్భంగా భవ్యశీని, ఆమె తల్లిదండ్రులను ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డీన్ శ్రీనివాసులు, ప్రైమరీ ఇన్‌ఛార్జి అమరవేణి, భవశ్రీ తండ్రి దేవినేని బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



ఎంఇఒకు వింత పత్రం అందిస్తున్న దృశ్యం

మధ్యాహ్న భోజన బిల్లులు ఇవ్వాలి

ప్రజాశక్తి - అద్దంకి

కార్మికులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరం ఉందని సిఐటియు నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు అన్నారు. మండల పరిధిలోని మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు చెల్లించాల్సిన బిల్లులు వెంటనే చెల్లించాలని కోరుతూ స్థానిక ఎంఆర్‌సి భవనం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలిపారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికుల మండల అధ్యక్షురాలు కోటేశ్వరమ్మ అధ్యక్షతన జరిగిన ధర్నాలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చాలీ చాలని జీతాలతో కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించేందుకు అప్పులు తెచ్చి పథకం కొనసాగిస్తున్నారని అన్నారు. ఇటువంటి కార్మికులకు బిల్లులు క్రమం తప్పకుండా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎంఇఒ బూదాటి సుధాకర్‌కు సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో అడుసుమల్లి సోమయ్య, కోటేశ్వరమ్మ, గోవిందమ్మ, లక్ష్మీ దేవమ్మ పాల్గొన్నారు.



క్షయ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ చంద్రశేఖర్

క్షయ వ్యాధి పట్ల అవగాహన

ప్రజాశక్తి - పర్చూరు

ప్రతి ఒక్కరూ క్షయ వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలని ఉప్పుటూరు హెూమియో వైద్యులు డాక్టర్ డి చంద్రశేఖర్ తెలిపారు. హెూమియో వైద్యశాలలో క్షయ వ్యాధిపై సోమవారం అవగాహన కల్పించారు. వైద్య సిబ్బంది, గ్రామస్తులచే గోడ పత్రిక విడుదల చేశారు. క్షయ వ్యాధిపై వంద రోజులు అవగాహన కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. క్షయ వ్యాధి (టిబి) అనేది కేవలం ఊపిరితిత్తులకే కాకుండా ఎముకలు, మెదడు, కిడ్నీలు వంటి ఇతర అవయవాలకు వస్తుందని చెప్పారు. ఎవరైనా అలసట, ఆకలి మందగించడం, విపరీతంగా బరువు కోల్పోవడం, తెమడా లేదా రక్తంతో కూడిన దగ్గు మూడు వారాలకు పైబడి ఉండడం, ఛాతిలో నొప్పి, సాయంత్రం పూట జ్వరం, రాత్రులు ఎక్కువగా చెమట పట్టడం వంటి లక్షణాలు ఉంటే క్షయ వ్యాధి (టిబి) ఉండే అవకాశం ఉంటుందని తెలిపారు. పై లక్షణాలు ఉంటే వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రజలందరూ టిబి రహిత దేశం నిర్మించడానికి అవగాహనతో జాగ్రత్తగా ఉండాలని చెప్పారు.



వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

సమస్యలపై వినతుల స్వీకరణ

ప్రజాశక్తి - రేపల్లె

స్థానిక ఆర్డిఓ ఎన్ రామలక్ష్మి ఆదేశాలతో ప్రజా సమస్యల పరిష్కార వేదిక సోమవారం నిర్వహించారు. వివిధ సమస్యలపై పది మంది వినతులు అందజేసినట్లు ఆర్‌డిఒ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ షేక్ హుస్సేన్ తెలిపారు. వినతులను సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చేసే దిశగా కృషి చేస్తామని అన్నారు. అర్జీలను సంబంధిత శాఖల అధికారులకు పంపించినట్లు తెలిపారు. ప్రతి అర్జీకి అర్థవంతమైన సమాధానం ఇస్తూ త్వరితగతిన పరిష్కరించాలని కోరారు.

అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి



కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ప్రజాశక్తి - బాపట్ల

అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రభుత్వ ఉద్యోగులనే పదాన్ని తొలగించి వారికి వేతనాలు పెంపుదల చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియూ) జిల్లా ప్రధాన కార్యదర్శి పి రేఖ ఎలిజబెత్, జిల్లా అధ్యక్షురాలు కె ఝాన్సీ డిమాండ్ చేశారు. ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయు) ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ధర్నాను ఉద్దేశించి యూనియన్ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తల్లికి వందనం ఇచ్చినప్పటికీ అందులో అంగన్‌వాడీలకు ఇవ్వకుండా మోసం చేసిందని అన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అంగన్‌వాడీల సమ్మె సందర్భంగా హామీలు ఇచ్చి ఇప్పుడు ఆదాయ పరిమితులు, నిబంధనలు పెట్టి మోసం చేస్తున్నారని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రూ.10వేల గౌరవ వేతనం పొందుతున్నారంటూ తల్లికి వందనం ఇవ్వకపోవడం మోసం చేయటమేనని అన్నారు. వితంతు, వికలాంగుల పెన్షన్స్, రేషన్ కార్డ్స్, ఇళ్ల స్థలాలు, అన్నదాత సుఖీభవ, మత్స్య భరోసా వంటి సంక్షేమ పథకాలు అందకుండా ఉండే విధంగా ప్రభుత్వ ఉద్యోగి అనే పదం తొలగించక పోవటం చూస్తే ప్రభుత్వానికి, గత ప్రభుత్వానికి ఏమి తేడా లేదని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే అంగన్‌వాడీలకు వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చి ఇప్పుడు నోరు మెదపకపోవడం వల్ల అంగన్‌వాడీలు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అంగన్‌వాడిల సమస్యల పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించపోతే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ మణిలాల్, ప్రధాన కార్యదర్శి సిహెచ్ మంజూదార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చిరు కార్మికుల సమస్యలు పరిష్కారం కోసం చొరవ చేయడం లేదని అన్నారు. కార్మిక వర్గానికి నూతన ప్రభుత్వం మీద ఉన్న ఆశలు నీరు కారుతున్నాయని, సమస్యలు పరిష్కారం చేయకపోతే గత ప్రభుత్వాలకు పట్టినగతే పడుతుందని అన్నారు. అనంతరం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా అధికారులకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో సిఐటియు, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్, సిఐటియు జిల్లా నాయకులు కె శరత్, శైలశ్రీ, అనిత, వై మేరీమణి, బ్యూలా, ఎన్ కృష్ణ కుమారి, డి జ్యోతి, బుచ్చిరాజు పాల్గొన్నారు.



గ్రీవెన్స్‌లో డిఆర్‌ఒకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

ఇరాన్‌పై అమెరికా దాడిని ఖండించండి : సిపిఎం

సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య

ప్రజాశక్తి - బాపట్ల

ఇరాన్‌పై అమెరికా దాడిని ఖండించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య కోరారు. ఇరాన్‌పై అమెరికా దాడులను ఖండిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో పట్టణంలోని ఉప్పరపాలెంలో నిరసన ప్రదర్శన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గల్ఫ్ దేశాల్లో చమురు నిక్షేపాలపై పెత్తనం కొనసాగించాలనే దుర్బుద్ధితో ఇరాన్‌లో అణు ఆయుధాలు ఉన్నాయని వంక చెబుతూ ఆ దేశంపై దాడికి దిగడం హేయమైన చర్యని అన్నారు. గతంలో సద్దాం హుస్సేన్‌పై, సిరియా, గాజాపై ఈ విధంగానే దాడులు చేసి ఆయా దేశాలను భయభ్రాంతులకు గురి చేశారని గుర్తు చేశారు. ప్రపంచమంతా అమెరికా యుద్ధోన్మాదాన్ని ఖండిస్తున్నా, పట్టించుకోకుండా మొండిగా వ్యవహరిస్తున్నారని అన్నారు. యుద్ధం వలన ఆయిల్ రేట్లు పెరిగి దాని ప్రభావం ప్రపంచమంతా ఉంటుందని అన్నారు. అందువలన అమెరికా చర్యలు మానుకోవాలని ఐక్య రాజ్య సమితి జోక్యం చేసుకొని యుద్ధం ఆపాలని హెచ్చరించారు. 200 మీటర్లు భూమిలోకి చచ్చుకుపోయి విస్ఫోటకం చెందే బాంబుల ప్రయోగంతో పెద్ద ఎత్తున ఆస్తి, ప్రాణ నష్టం సంభవించే ప్రమాదం దృష్ట్యా దీన్ని ఆపాలని అన్నారు. అమెరికా చర్యలకు ప్రధాని నరేంద్ర మోడీ వత్తాసు పలకడం భారతదేశానికి నష్టమని అన్నారు. దేశప్రజలు దీన్ని పెద్దఎత్తున ఖండించాలని అన్నారు. అమెరికా వైఖరి పట్ల ఇదే తీరు కొనసాగితే సామాన్య ప్రజలు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి కొండయ్య, సిఐటియు నాయకులు కె శరత్, సిపిఎం ఉప్పరపాలెం కార్యదర్శి షేక్ సుభాని, రంగారెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గంగయ్య

నల్ల బ్యాడ్జీలతో గ్రామ సర్వేయర్ల నిరసన



పంగులూరులో నిరసన తెలియజేస్తున్న గ్రామ సర్వేయర్లు

ప్రజాశక్తి - పంగులూరు

రాష్ట్రంలోని గ్రామ సర్వేయర్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక తహశీల్దారు కార్యాలయం ముందు నల్ల బ్యాడ్జీలు ధరించి గ్రామ సర్వేయర్లు సోమవారం నిరసన తెలిపారు. హేతుబద్ధీకరణలో భాగంగా మిగులు సిబ్బంది అయిన 4722 మంది గ్రామ సర్వేయర్ల భవిష్యత్తు కోసం సమగ్రమైన నివేదిక సమర్పించాలని, గ్రేడ్ 3, గ్రేట్ 2 హెూదాలు మార్చిన పే స్కేలులో తగిన మార్పులు చేయాలని, అన్ని జిల్లాల్లో సీనియార్టీ జాబితాలు ప్రకటించాలని, క్యాడర్ స్ట్రింగ్ ఫైనల్ చేయాలని, అర్హత కలవారందరికీ పదోన్నతి వచ్చేలా సర్వీసులో తగిన మార్పులు చేయాలని కోరారు. నేటి నుండి జరిగిన రీ సర్వేలో పెండింగులో ఉన్న బిల్లులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్వేయర్లు తిరువీధులు వీరాంజనేయులు, కసిరెడ్డి అనంతరెడ్డి, పోలిశెట్టి చందు, నక్క సుధాకర్, పరశపాగు నరేష్, జెల్లీ బ్లెస్సీ దీపిక, షేక్ నజ్మా, గెల్లా ప్రసన్న బాబు, నాయపాము ఎలేషా, షేక్ నాగుల్ మీరావాలి, పాలపర్తి రవి, ఈపురి రాజా, చలంచర్ల రవిబాబు, పాలపర్తి నాగార్జున పాల్గొన్నారు.

యద్దనపూడి : స్థానిక తహశీల్దారు కార్యాలయం గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న సర్వేయర్లు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం నిరసన తెలిపారు. అనంతరం తహశీల్దారుకు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. జీఓ నెంబరు ఒకటి ప్రకారం హెతువద్ధీకరణలో భాగంగా మిగులు సిబ్బంది అయిన 4722 మందిని విఎస్‌పై సమగ్ర నివేదిక సమర్పించాలని కోరారు. జిఓ 11 ప్రకారం గ్రేడ్ 3 నుండి హెూదా మార్చినందున పే స్కేల్‌లో తగిన మార్పులు చేయాలని కోరారు. అన్ని జిల్లాల్లో సీనియర్టీ జాబితాలు వెంటనే ప్రకటించాలని, గ్రేడ్ 1 క్యాడర్ స్ట్రెంగ్త్ ఫైనల్ చేయాలని, ఇప్పటివరకు జరిగిన రీ సర్వేలో పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని, అర్హత కలిగిన వారందరికీ పదోన్నతులు కల్పించే విధంగా సర్వీసులో మార్పులు చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.



యద్దనపూడిలో నిరసన తెలుపుతున్న గ్రామ సర్వేయర్లు



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

ఇంజినీరింగ్ కార్మికులకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి

ప్రజాశక్తి - బాపట్ల

మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరుతూ స్థానిక కలెక్టరేట్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ ఇంజనీర్ కార్మికులు సోమవారం ధర్నా చేశారు. ధర్నాను ఉద్దేశించి యూనియన్ జిల్లా కన్వీనర్ వీరస్వామి మాట్లాడుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల పట్ల ప్రభుత్వం పక్షపాత వైఖరిని అవలంబిస్తుందని అన్నారు. ఇంజనీరింగ్ కార్మికులకు ఏ ఒక్క సంక్షేమ పథకం అమలు కావట్లేదని అన్నారు. కేవలం రూ.12వేల నుండి రూ.15వేలు మాత్రమే తమ వేతనాలు ఉన్నాయని అన్నారు. మునిసిపల్ ఇంజనీరింగ్ కార్మికులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింప చేసి, జిఓ నెంబర్ 36 ప్రకారం వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్లో డిఆర్‌ఓకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ మజుందార్, కె శరత్, మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల యూనియన్ నాయకులు కోటేశ్వరరావు, ప్రమీల, మురళి, రత్నం, అంకారావు పాల్గొన్నారు.

6న 'దాచూరి' మెడికల్ క్యాంపు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

మాజీ శాసనమండలి సభ్యులు దాచూరి రామిరెడ్డి స్మారక రెగ్యులర్ మెడికల్ క్యాంపు ఒంగోలు నెల్లూరు బస్టాండ్ సమీపంలోని తిరుమల తిరుపతి దేవస్థాన కళ్యాణ మండపంలో జులై ఆరున ఆదివారం నిర్వహిస్తున్నట్లు మెడికల్ క్యాంపు కన్వీనర్ మాదాల వెంకటరావు ఓ ప్రకటనలో తెలిపారు. దాచూరి రామిరెడ్డి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ప్రతి రెండు నెలలకు ఒకసారి నిర్వహించే ఈ శిబిరంలో బిపి, షుగర్, ఫిట్స్, పక్షవాతం కలిగిన రోగులకు 2 నెలలకు అవసరమైన మందులు కేవలం రూ.200కే అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించే ఈ మెడికల్ క్యాంపులో వివిధ విభాగాల్లో అనుభవజ్ఞులైన ప్రముఖ వైద్యులు డాక్టర్ గోపాళం శివన్నారాయణ, డాక్టర్ బి.హరిబాబు, డాక్టర్ సిహెచ్ సుధాకర్‌బాబు, డాక్టర్ యల్.జాన్ రిచర్డ్స్, డాక్టర్ చాపల వంశీకష్ణ, డాక్టర్ ఎస్. ధీరజ్ బాబు, డాక్టర్ ఎస్. సందీప్ ప్రకాష్, డాక్టర్ జి. చైతన్య, డాక్టర్ ఎం.శరత్, డాక్టర్ కొల్లా భారతి, డాక్టర్ ఎస్.కె సమీర్ శర్మ, డాక్టర్ రంజిత్ బాషా, డాక్టర్ రవితేజ, డాక్టర్ సుందర్ ప్రసాద్ తదితరులు పాల్గొని అవసరమైన వైద్య సేవలు అందించనున్నట్లు వివరించారు. ఈ పాటికే వైద్యం పొందుతున్న రోగులు బిపి, షుగర్ వంటి రక్త పరీక్షలు చేయించుకుని ఆయా రిపోర్టులు తో పాటు, పాత మందుల చీటీలతో వైద్య శిబిరానికి రావాలన్నారు. కొత్తగా వచ్చే వారు వైద్య పరీక్షలు చేయించుకొని ఆ రిపోర్టు, వాడే మందుల చీటీ, ఆధార్ కార్డు తెచ్చుకోవాలన్నారు. పేషెంట్లు ఈ మెడికల్ క్యాంపును ఉపయోగించుకుని వైద్య సేవలు పొందవలసినదిగా కోరారు.

పనిచేసే ప్రాంతాల్లోనే బదిలీలు చేపట్టాలి

సచివాలయ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీలను వారి సొంత మండలాల్లో, మున్సిపాలిటీలలోనే చేపట్టాలని కోరుతూ సోమవారం ఒంగోలులో సచివాలయ ఉద్యోగులు కార్పొరేషన్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సొంత ప్రాంతాల్లో పని చేసే హక్కు అందరికీ ఉండాలని, ప్రస్తుతం అమలులో ఉన్న నిబంధనల వల్ల ఉద్యోగులు మానసికంగా బాధపడుతున్నారని తెలిపారు. తక్కువ జీతాలతో ఎక్కువ పనిభారం మోస్తున్నామని, ఇతర మండలాలకు పంపాలనుకోవడం అన్యాయమని వాపోయారు. ఇంక్రిమెంట్లు పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే మంజూరు చేయాలని కోరారు. వాలంటీర్లు లేని కారణంగా అన్ని రకాల పనులూ సచివాలయ ఉద్యోగుల మీదే వచ్చి పడుతున్నాయని వివరించారు. ఆరు సంవత్సరాలుగా సేవలందిస్తున్నప్పటికీ కొన్ని శాఖల్లో పదోన్నతులు లేకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. తమను ఇతర మండలాలకు బదిలీ చేయాల్సి వస్తే పదోన్నతులు కల్పించి బదిలీలు చేయాలని వారు కోరారు. తమ న్యాయమైన కోర్కెలను ప్రభుత్వం తీర్చని పక్షంలో ఆందోళన బాట పడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నగరంలోని వివిధ సచివాలయాల ఉద్యోగులు పాల్గొన్నారు.

అర్జీ పరిష్కారం అయ్యాక

తెలుగులోనే బదులివ్వాలి..

డిఆర్‌ఒ గంగాధర్‌గౌడ్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేసిన ప్రతి అర్జీదారుని సమస్య పరిష్కారమైన అనంతరం లిఖితపూర్వకంగా తెలుగులోనే బదులు ఇవ్వాలని జిల్లా రెవెన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్ చెప్పారు. పిజిఆర్ఎస్ కార్యక్రమం సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో డిఆర్ఒ అధ్యక్షతన జరిగింది. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారులు లిఖితపూర్వకంగా అధికారులకు వినతిపత్రాలను అందించారు. తమ సమస్యలు పరిష్కరించాలంటూ అభ్యర్థించారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి తక్షణమే పరిష్కరిస్తామని జిల్లా రెవెన్యూ అధికారి హామీ ఇచ్చారు. గడువులోగా అర్జీలు పరిష్కరించాలని అధికారులను ఆయన ఆదేశించారు. పెండింగ్‌లో లేకుండా అధికారులు పర్యవేక్షించాలన్నారు. చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరిష్కరించిన తదుపరి వారికిచ్చే ధ్రువీకరణ పత్రం తెలుగులోనే ఉండాలన్నారు. 70 శాతం అర్జీలకు సక్రమంగా సమాధానం ఇవ్వడం లేదని ఆయన చెప్పారు. పీజీఆర్ఎస్ అర్జీలపై నిర్లిప్తంగా ఉండరాదన్నారు. అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని ఆయన పలు సూచనలు చేశారు. పిజిఆర్ఎస్ అర్జీలపై ఆడిట్ నిర్వహించాలన్నారు. ప్రజలకు మేలు చేయడమే లక్ష్యంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో పి గ్లోరియా, ఉప కలెక్టర్ లవన్న, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

'క్విస్'లో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్



మాట్లాడుతున్న ప్రొఫెసర్

ఒంగోలులోని క్విస్ ఇంజినీరింగ్ కళాశాలలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎఫ్‌డీపీ) సోమవారం ప్రారంభమైనట్లు విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ నిడమానూరి శ్రీ గాయత్రి తెలిపారు. కళాశాలలోని రామానుజన్ సెమినార్ హాల్‌లో ఐదు రోజుల పాటు ఈ కార్యక్రమం జరగనుంది. ఎన్ఐటిటిఆర్‌కి చెందిన ప్రొఫెసర్ కె.ఎస్ గిరిధరన్, డాక్టర్ ఎం. అనిల్ కుమార్ రిసోర్స్ పర్సన్స్‌గా వ్యవహరిస్తున్నారు. కార్యక్రమాన్ని క్విస్ ఇంజనీరింగ్ కళాశాల డీన్ అకడమిక్స్ డాక్టర్ సత్య మెహర్ పర్యవేక్షిస్తున్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.వి. హనుమంతరావు కార్యక్రమానికి అధ్యక్షత వహించారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

ప్రజాశక్తి-మద్దిపాడు

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ప్రముఖ పారిశ్రామికవేత్త కావూరి వాసు పేర్కొన్నారు. మండలంలోని వెంకటరాజుపాలెంలో సోమవారం నాడు మొక్కలు నాటారు. కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న శ్రీనివాసరావు

కరపత్రం ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

భూ యజమానులు నష్టపోకుండా పంట సాగుదారుల చట్టం -2019 ద్వారా ఎటు వంటి నష్టం జరగకుండా భూ యజమానులు కౌలు రైతులకు పంట సాగు ధ్రువీకరణ పత్రాలు వచ్చేలా సహకరించాలని జిల్లా వ్యవసాయ అధికారి డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం నాడు దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో ఈ చట్టానికి నిర్దేశించిన కరపత్రాలను డిబిఆర్ సి రీజనల్ కో-ఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావుతో కలసి శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కౌలు రైతుల పంట సాగుదారుల గ్రామస్థాయిలో భూయజమానుల వద్ద నుండి సాగు చేస్తున్న కౌలు భూముల సాగుపై మాత్రమే కౌలు రైతుకు హక్కు ఉంటుందని, భూమిపై కాదనే విషయాన్ని భూయజమానులు గుర్తించి కౌలు రైతులకు సహకరించాలని తెలిపారు. రైతు సేవా కేంద్రాలలో గ్రామ రెవిన్యూ అధికారి, గ్రామ వ్యవసాయ సహాయకులు సహకారంతో పంట సాగు ధ్రువీకరణ పత్రాలు(సిసిఆర్సి) తీసుకొని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న అన్నదాత సుఖీభవ, పంటల బీమా, ఇన్ పుట్ సబ్సిడీ, బ్యాంకు రుణాలు పొందటానికి కౌలు రైతులకు ఎక్కువ అవకాశం ఉన్నందున, ప్రతి కౌలు రైతు పంట సాగు ధవీకరణ పత్రాలు పొందాలని చెప్పారు. కార్యక్రమంలో కమ్యూనిటీ కో-ఆర్డినేటర్ గుంటూరు నాగమణి పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల

సమస్యలు పరిష్కరించాలి

నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ



మేనేజర్‌కు అర్జీ ఇస్తున్న నాయకులు

ఒంగోలు నగర పాలక సంస్థలో పనిచేస్తున్న కోవిడ్ పారిశుధ్య కార్మికులకు మూడు నెలల పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలని, ఆప్కాస్ కార్మికులకు తల్లికి వందనం, ఇతర సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) డిమాండ్ చేసింది. ఆ సంఘం నగర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నాడు ఒంగోలు నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ధర్నానుద్దేశించి సిఐటియు నగర కార్యదర్శి టి.మహేష్, మున్సిపల్ వర్కర్స్ జిల్లా కార్యదర్శి కొర్నేపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రం చేస్తూ. పర్యావరణాన్ని కాపాడుతున్న మున్సిపల్ కార్మికులకు ఆదాయ పరిమితితో సంబంధం లేకుండా తల్లికి వందనం వంటి సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అతి తక్కువ వేతనాలతో పనిచేసే (ఔట్ సోర్స్) మున్సిపల్ కార్మికులకు ఉద్యోగులుగా పేర్కొని ప్రభుత్వ సంక్షేమ పథకాలు కోత విధించడం తగదని పేర్కొన్నారు. గత ప్రభుత్వ కాలపు 17 రోజులు సమ్మె కాలపు ఒప్పందాలు హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం సుమారు 50 మందిని ఆప్కాస్‌కు తీసుకోకుండా ఏజెన్సీ ద్వారానే కొనసాగిస్తుందన్నారు. వారిని ఆప్కాస్‌లోకి తీసుకోవాలని ఉన్నతాధికారులకు, శాసనసభ్యులు దామచర్ల జనార్ధనరావుకు అనేక పర్యాయాలు విన్నవించినప్పటికీ నేటికీ ఆప్కాస్‌లోకి తీసుకోలేదని తెలిపారు. ఏళ్ల తరబడి చేస్తున్న వారిని పక్కనపెట్టి టిడిపి కార్యకర్తలను ఆప్కాస్‌లో చేర్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. కార్మికుల పొట్టలు కొట్టి వాళ్ల కార్యకర్తలను అప్కాస్‌లో చేర్చే ప్రయత్నం మానుకోవాలని డిమాండ్ చేశారు. ఇవ్వాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తక్షణమే మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారం చేయకుంటే కార్మికుల ఆందోళన తీవ్రతరం చేస్తారని హెచ్చరించారు. అనంతరం మున్సిపల్ మేనేజర్ శ్రీహరికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో యూనియన్ నగర కార్యదర్శి తేళ్ల విజయమ్మ. ఆర్ శ్రీనివాసరావు, బి.బాబు. కే.యాకోబు, సంతోషమ్మ, కే.పద్మ, విజయ్, కే.వంశీ, కే.కపాకర్‌రావు, మస్తాన్, చిరంజీవి, అనిత, జేమ్స్ పాల్గొన్నారు.

లోకేష్‌కు ఘన స్వాగతం

- ఎమ్మెల్యే ఏలూరి క్యాంప్ కార్యాలయం వద్ద కిక్కిరిసిన హైవే
- గజమాలతో సంఘీభావం తెలిపిన నల్లబర్లీ రైతులు

ప్రజాశక్తి-మార్టూరు రూరల్



లోకేష్‌ను, ఏలూరిని గజమాలతో సత్కరిస్తున్న దృశ్యం

పర్చూరు నియోజకవర్గంలో పర్యటిం చిన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు సోమవారం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సారథ్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. క్యాంపు కార్యాలయం వద్దకు చేరుకున్న లోకేష్‌కు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పుష్ప గుచ్ఛం అందించి స్వాగతం పలికారు. మంత్రులు గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్, డోలాశ్రీ బాల వీరాంజనేయ స్వామి మంత్రి లోకేష్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయం వద్ద హైవేపై నల్లబర్లీ పొగాకు రైతులు భారీ గజమాలతో మంత్రి లోకేష్‌ను సత్కరించారు. అనంతరం భారీ కాన్వాయిగా కొలలపూడి, ముప్పవరం, పంగులూరు, ఆరికట్లవారిపాలెం మీదుగా గంగవరం చేరుకున్నారు.

జన నీరాజనం

పంగులూరు: విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు మండలంలో సోమవారం ఘన స్వాగతం లభించింది. అడుగడుగునా జనం నీరాజనాలు పలికారు. ఇంకొల్లు మండలం, గంగవరంలో సైనిక్ స్కూలు ప్రారంభోత్సవానికి వెళుతున్న ఆయన ముప్పవరం నుండి పంగులూరు మండలంలోకి ప్రవేశించారు. మొదట ముప్పవరంలో ప్రజలు, డ్వాక్రా మహిళలు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుండి జనకవరం, పంగులూరు, ఆరికట్లవారి పాలెం మీదుగా గంగవరం వెళ్లారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలకు కూడా ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, పని భారం పెరుగుతున్నందున పెన్షన్లు పంపిణీ నుండి తమను మినహాయించాలనే డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అంగన్‌వాడీలు లోకేష్‌కు అందజేశారు. కార్యక్రమంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్, తెలుగుదేశం మండల అధ్యక్షులు రావూరి రమేష్ బాబు, జిల్లా డెయిరీ మాజీ ఛైర్మన్ బాలిన రామసుబ్బారావు, కుక్కపల్లి ఏడుకొండలు, చింతల సహదేవుడు, జాగర్లమూడి సుబ్బారావు (జెకెసి), గుర్రం ఆదిశేకర్, ఎర్రం శ్రీనివాసరెడ్డి, బోరెడ్డి ఓబుల్‌రెడ్డి, వలపర్ల సుబ్బారావు, జాగర్లమూడి భాను ప్రకాష్, కొమ్మారెడ్డి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

కార్యకర్తలను నిరాశపరిచిన లోకేష్

లోకేష్ పర్యటన విజయవంతం చేయాలని తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పంగులూరులో భారీగా స్వాగత ఏర్పాట్లు చేశారు. బస్టాండ్ సెంటర్లోని ఎన్టీఆర్ విగ్రహానికి లోకేష్ పూలమాల వేసే విధంగా కార్యక్రమం రూపొందించుకొని అందుకు తగిన ఏర్పాట్లు చేశారు. సెంటర్లో పసుపు తోరణాలతో అలంకరించారు. అయితే అక్కడకు చేరుకున్న లోకేష్ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేయకుండా కారులోనే ఉండిపోయారు. కార్యకర్తలు కోరినప్పటికీ ఆయన కారులోనే ఉండి ప్రజలకు అభివాదం చేశారు. చివరకు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేశారు. లోకేష్ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేయకపోవడంతో తెలుగుదేశం నాయకులు కొంత అసంతృప్తికి గురయ్యారు.





లోకేష్‌కు స్వాగతం పలుకుతున్న ఏలూరి, కలెక్టర్ వెంకటమురళి, ఎస్పీ తుషార్ దూడీ

నల్లబర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాలు పెంచాలి

- 25శాతంకు తేమ శాతాన్ని పెంచాలి
- రైతులందరికీ న్యాయం జరిగేలా చూడాలి
- కేంద్రాల్లో కొనుగోలు సామర్థ్యాన్ని పెంచాలి
- నిబంధనల పేరుతో చెక్కులను వెనక్కి పంపవద్దు
- 'ప్రజాశక్తి'తో జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు

ప్రజాశక్తి - పంగులూరు

రైతుల దగ్గర ఉన్న నల్లబర్లి పొగాకును వెంటనే కొనుగోలు చేసే విధంగా మార్క్‌ఫెడ్ అధికారులు చర్యలు తీసుకోవాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు కోరారు. సోమవారం ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. ఈపాటికి రైతులు తమ పొగాకును మూడు నెలల క్రితం మండేలు కట్టారని, కాలయాపన జరగటం వలన అవి కొంత చెడిపోయే పరిస్థితి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. వర్షా కాలం రానునందు వల్ల మరింత ఇబ్బంది ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు. అందువలన ఎక్కువ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి తక్షణమే పొగాకు మొత్తం కొనాలని డిమాండ్ చేశారు. 80 శాతం కౌలు రైతులే నల్లబర్లీ పొగాకు సాగు చేశారని చెప్పారు. వీరి పొగాకును కొనాలంటే భూ యజమాని ఖాతా నెంబరు, సర్వే నెంబరు కావాలని అధికారులు చెబుతున్నారని, భూ యజమానులు కౌలు రైతులకు ఖాతా నెంబరు, సర్వే నెంబరు ఇవ్వటానికి ఇష్టపడటం లేదని అన్నారు. అందువలన ఆ నిబంధనలు సడలించి వాటితో పని లేకుండా కొనుగోలు చేయాలని కోరారు. పొగాకులో తేమ శాతం 20శాతం లోపు ఉంటేనే కొంటామని మార్క్‌ఫెడ్ నిబంధన పెట్టారని, అయితే మండెల మీద చూసిన కూడా 25శాతానికి పైగానే తేమశాతం ఉంటుందని అన్నారు. ఈ పరిస్థితుల్లో రైతులెవరూ తమ పొగాకును అమ్ముకునే అవకాశం లేదని అన్నారు. అందువలన నిబంధనలు సడలించి తేమశాతం 25 శాతానికి పెంచాలని కోరారు. రైతులు పొగాకును గ్రేడ్ చేసి తీసుకెళ్తున్నారని, అయినా కూడా మార్కెట్ ధరలను మూడు గ్రేడ్లుగా చేసిందని చెప్పారు. సరాసరి రూ.7 వేల నుండి రూ.8వేల కన్నా ధర పలకటం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ప్రవేట్ వ్యాపారులు తాళ్లతోటి ఉన్న పొగాకును రూ.7వేల నుంచి రూ.9వేల వరకు కొంటున్నారని, దీని మీద ప్రైవేట్ వ్యాపారులే బెటర్ అని రైతులు అభిప్రాయపడుతున్నారని చెప్పారు. ప్రభుత్వ సంస్థ అయిన మార్క్‌ఫెడ్ సంస్థ ప్రైవేటు వ్యాపారుల కన్నా ఎక్కువ నిబంధనలు పెట్టి రైతులు చెక్కులను వెనక్కి పంపిస్తున్నారని ఆరోపించారు. దీనివల్ల రైతులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. మార్క్‌ఫెడ్ సంస్థ వ్యాపార పరంగా చూడకుండా రైతుల శ్రేయస్సును చూసే విధంగా పనిచేయాలని కోరారు. మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాల్లో పొగాకు చెక్కులు వేగవంతంగా కొనడం లేదని, రోజుకు 70 నుండి 80 చెక్కులకు మించి కొనడం లేదని అన్నారు. ఈ విధంగా అయితే నాలుగు నెలల పాటు కొనుగోలు చేయాల్సి వస్తుందని అన్నారు. దీంతో రైతుల ఆర్థిక పరిస్థితి చిన్నాభిన్నం అవుతుందని అన్నారు. పొగాకు కూడా అంత కాలం నిల్వ ఉంటే పూర్తిగా చెడిపోయి పనికిరాకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మార్క్‌ఫేడ్ కొనుగోలు కేంద్రాలు పెంచి, రైతుల వద్దనున్న పొగాకు మొత్తాన్ని వీలైనంత త్వరలో కొనుగోలు చేయాలని, రైతులను ఆదుకోవాలని కోరారు. పొగాకు కొనుగోలులో రాజకీయ జోక్యం జరుగుతుందని అన్నారు. రాజకీయ జోక్యం రైతులను పూర్తిగా నష్టాల్లోకి తీసుకెళుతుందని, రాజకీయ జోక్యం లేకుండా పొగాకును స్వతంత్రంగా మార్క్‌ఫెడ్ సంస్థ కొనాలని, రైతులను ఆదుకోవాలని కోరారు.



పొగాకును మండెలు తొక్కుతున్న దృశ్యం



రైతు సంఘం జిల్లా కార్యదర్శి తల్లపనేని రామారావు



సిఎం సహాయనిధి చెక్కులు అందజేస్తున్న ఆనందబాబు

సీఎం సహాయనిధి చెక్కులు అందజేత

ప్రజాశక్తి - వేమూరు

నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలోని 13మంది పేదలు అనారోగ్యంతో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేసుకున్నని వైద్య ఖర్చుల కోసం సిఎం సహాయ నిధికి ధరకాస్తు చేసుకున్న వారికి చికిత్స నిమిత్తం అయిన ఖర్చును శాసన సభ్యులు నక్కా ఆనంద బాబు సిఎంఆర్ఎఫ్ కార్యాలయ అధికారులకు సిఫార్సు చేశారు. ఈ మేరకు సిఎం సహాయ నిధి నుండి మంజూరైన రు.6,68,038 విలువైన చెక్కులను సోమవారం తన కార్యాలయంలో అందజేశారు.



డీలర్లతో మాట్లాడుతున్న తహశీల్దారు సుశీల

వృద్ధులు, వికలాంగులకు 26 నుండి రేషన్ పంపిణీ

ప్రజాశక్తి - భటిప్రోలు

ప్రభుత్వ ఆదేశాల మేరకు వృద్ధులు, వికలాంగులకు ఈనెల 26నుండి జులై నెలకు సంబంధించిన రేషన్ అందించనున్నట్లు తహశీల్దారు సుశీల తెలిపారు. స్థానిక తహశీల్దారు కార్యాలయంలో డీలర్లతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 60ఏళ్లు పైబడిన వారందరికీ జూలై నెలకు సంబంధించిన రేషన్ పంపిణీ ఈనెల 26నుంచి చేయాలని డీలర్లకు సూచించారు. ప్రతి డీలరు ఈ పోస్ట్ మిషన్లను బ్లూటూత్ ద్వారా కాటలకు కనెక్ట్ చేసి రేషన్ పంపిణీ చేయాలని చెప్పారు. సమావేశంలో సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దారు, డీలర్లు పాల్గొన్నారు.



చెత్త తొలగిస్తున్న పారిశుద్య కార్మికులు

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి - అద్దంకి

పరిసరాల పరిశుభ్రత ఎంతో అవసరమని, ప్రతి ఒక్కరూ పాటించి వ్యాధులకు దూరంగా ఉండాల్సిన అవసరం ఉందని ఎంపిడిఒ బి సింగయ్య అన్నారు. మండలంలోని తిమ్మాయపాలెం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల సమీపంలో సచివాలయ అధికారులు వ్యర్థాలను సిబ్బందితో తొలగించే పని చేయించారు. పాఠశాల సమీపంలో ప్రహరీ గోడల వెంట చెత్త, ఇతర వ్యర్థ పదార్థాలను ఆ ప్రాంతంలో నివాసం ఉంటున్న ప్రజలు అక్కడ కుప్పులు వేస్తున్నారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది మాట్లాడుతూ ఎవరైనా వ్యర్థాలను ప్రహరీ గోడల వెంట వేయవద్దని చెప్పారు. ఎవరి ఇంటి ముందు వారు డబ్బాల్లో ఉంచితే గ్రామానికి చెందిన గ్రీన్ అంబాసిడర్లు వాటిని బయటికి తరలిస్తారని తెలిపారు. పారిశుద్య నిర్వహణలో సిబ్బందికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకు కొనుగోళ్లపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - యద్దనపూడి

స్థానిక తహశీల్దారు కార్యాలయంలో విఆర్‌ఒల సమీక్ష సమావేశం సోమవారం నిర్వహించారు. సమావేశంలో తహశీల్దారు రవికుమార్ మాట్లాడుతూ నల్లబర్లీ పోగాకు పండించిన రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు. మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, తొందరపడి రైతులు ప్రైవేట్ వ్యక్తులకు తక్కువకు అమ్ముకొని నష్టపోవద్దని వివరించాలని తెలిపారు. ఎవరైనా రైతులు వ్యవసాయ శాఖ దగ్గర నమోదు చేయించుకోకపోతే నమోదు చేసుకోవాలని చెప్పారు. మార్క్‌ఫెడ్ అధికారులు నిర్ణయించిన తేదీన తమ వద్ద ఉన్న పొగాకు బేళ్లు తీసుకు వెళ్లే విధంగా అవహాన పెంచాలని కోరారు. మండలంలోని వృద్ధులు, వికలాంగులకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అందించే సరుకులను జూన్ 20 నుండి నెల చివరి వరకు ఇస్తారని, జులై 1న డీలర్ షాపుకు వచ్చే పని లేదని, దానిపై కూడా అవగాహన పెంచాలని అన్నారు. కార్యక్రమంలో విఆర్‌ఒలు శేషుబాబు, సత్యనారాయణ, వసంతరావు, పావని, వలేరు రవి, కోటేసు, సీనియర్ అసిస్టెంట్ భాస్కరరావు, గంగాధర్ పాల్గొన్నారు.



విఆర్‌ఒలతో మాట్లాడుతున్న తహశీల్దారు రవికుమార్



మాట్లాడుతున్న కొల్లూరు ఎఒ వి సురేంద్రబాబు

వ్యవసాయ పథకాలపై అవగాహన

ప్రజాశక్తి - కొల్లూరు

వ్యవసాయ అధికారి కార్యాలయంలో రైతు సేవా కేంద్రం సిబ్బందితో సమీక్ష సమావేశం సోమవారం నిర్వహించారు. వ్యవసాయ అధికారి వి నరేంద్రబాబు, అగ్రికల్చర్ ఆఫీసర్ కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ రైతు సేవా కేంద్రానికి వచ్చిన వరి విత్తనాలు సబ్సిడీపై రైతులకు అందించాలని తెలిపారు. రైతు సేవ కేంద్రం పరిధిలో రైతులకు అందుబాటులో ఉండి సూచనలు సలహాలు ఇవ్వాలని కోరారు. పామ్ ఆయిల్ రైతులు అప్లికేషన్లను కార్యాలయం నందు అందించాలని సూచించారు. అరటి సాగు చేసిన రైతులు టిషుట్య కల్చర్‌కు అనుసంధానం చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు, విఎఎ, విహెచ్ఎ, ఎంపిఈఓలు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలతో సీక్రెడ్ హార్ట్స్ విద్యార్థులు

ప్రజాశక్తి - అమృతాలూరు

మండలంలోని కూచిపూడిలో గల సీక్రెడ్ హార్ట్స్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణతతో ఉత్తమ ఫలితాలు సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ సిరియాకు మాథ్యూ తెలిపారు. గ్రామీణ ప్రాంతంలో గత 32ఏళ్లుగా విద్యార్థులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసి ఉత్తమ విద్యా బోధన గావిస్తున్నట్లు తెలిపారు. నర్సరీ నుండి 10వ తరగతి వరకు సిబిఎస్ఈ సిలబస్‌తో విద్యార్థినీ, విద్యార్థులకు ప్రత్యేక వసతి గృహాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డేస్కాలర్ విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా నిరంతరం పయనిస్తుందని తెలిపారు. ప్రజల ఆదరణతో ముందుకు సాగుతూ దినిధినాభివృద్ధి చెందుతుందని అన్నారు. సేవా భావంతో ఫాదర్స్, సిస్టర్స్ సమన్వయంతో నడుపుతున్న తమ పాఠశాల నీష్ణాత్ములైన ఉపాధ్యాయతో ప్రామాణిక విద్య బోధిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థుల్లో నైపుణ్య శిక్షణను పెంపొందించే అబాకస్, వేదిక్ గణితం, మనో గణితం బోధించడం తమ పాఠశాల ప్రత్యేకత అన్నారు. విద్యార్థులకు శ్రమ, ఒత్తిడిని తగ్గించే యోగ తరగతులు, కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించే స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులు, సెమినార్లు ప్రత్యేకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులను సాంకేతపరంగా అభివృద్ధి చేసే కంప్యూటర్ విజ్ఞానం, జ్ఞాన అన్వేషణకు మార్గం చూపే విద్యార్థుల్లో తలదించుకునే స్థాయి నుండి తల ఎత్తుకునే స్థాయికి అభివృద్ధి చేసేవిధంగా అధునాతనమైన గ్రంథాలయం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపే కరాటే శిక్షణ, పరిపూర్ణ వికాసం పెంపొందించే అనుబంధ కార్యక్రమాలతో పాఠశాల నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తక్కువ ఫీజులతో విద్యార్థులు ఎకవ ఫలితాలు సాధించుటకు తోడ్పడుతున్న విద్యాసంస్థని తెలిపారు. 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో నూటికి నూరు శాతం ఫలితాలు సాధిస్తూ గడిచిన విద్యా సంవత్సరం ప్రతిభా పురస్కారాలకు ఎంపికైనట్లు తెలిపారు. మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు తమ విద్యార్థులు సాధించినట్లు తెలిపారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి విద్యార్థి పట్ల వ్యక్తిగత శ్రద్ధ తీసుకుని విద్యా బోధన చేస్తున్న ఏకైక విద్యా సంస్థ తమదేనని చెప్పటానికి సంతోషిస్తున్నామని తెలిపారు.



సిరియాక్ మాథ్యూ



ఉద్యోగులను సన్మానిస్తున్న దృశ్యం

ఉద్యోగులకు సన్మానం

ప్రజాశక్తి - బాపట్ల

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పరిపాలన అధికారిగా పనిచేసిన కె లావణ్య కాకుమాను మండలానికి, సీనియర్ అసిస్టెంట్ నాగేశ్వర నాయక్ భట్టిప్రోలు మండలానికి బదిలీలైన సందర్భంగా వారి సేవలను కొనియాడుతూ సోమవారం ఘనంగా సన్మానించారు. బదిలీలైన వారి స్థానాల్లో తుళ్ళూరు పరిపాలన అధికారి చక్రధరరావు, సీనియర్ అసిస్టెంట్‌గా దిలీప్ వర్మ రాజు బాపట్లకు బదిలీపై వచ్చారు. కార్యక్రమంలో ఎంపిడిఓ బి బాబురావు, ఎంపిపి చిన్నిపోతుల హరిబాబు, ముక్కామల సాంబశివరావు, పిఆర్ ఎఇ మోహనరావు, సాంబశివరావు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు నెరవేర్చని చంద్రబాబు : మేరుగ


మాట్లాడుతున్న మేరుగ నాగార్జున, కోన రఘుపతి

ప్రజాశక్తి - బాపట్ల

సిఎం చంద్రబాబు యువతకు ఇచ్చిన హామీల్లో ఒక్క హామీ కూడా పరిష్కారానికి నోచుకోలేదని మాజీ మంత్రి, వైసిపి జిల్లా అధ్యక్షులు మేరుగ నాగార్జున ఆరోపించారు. వైసిపి నిర్వహించిన యువత పోరులో జరిగిన ర్యాలీని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఏడాదిగా ఒక్క ఉద్యోగం ఇవ్వలేని, డీఎస్సీ పేరుతో కాలయాపన చేస్తోందని అన్నారు. లక్షల మంది యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తుంటే ఉన్న ఉద్యోగులను పీకేసేందుకు చూస్తోందని అన్నారు. నిరుద్యోగ భృతి నెలకు రూ.3వేలు ఇస్తామని నిరుద్యోగులకు ఇచ్చిన పాపాన పోలేదన్నారు. ఎవరైన ప్రశ్నిస్తే కేసులు మోపి జైళ్ళకు పంపుతున్నారని అన్నారు. మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ ఎన్నికల మ్యానిఫెస్టోపై ప్రతిపక్షంగా తాము నిలదీస్తామని అన్నారు. ఎన్నికల ముందుకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో ఒక్కటీ అమలు చేయలేదని అన్నారు. 50ఏళ్ళకే బీసీలకు పెన్షన్ ఇస్తామని, ఉన్న పెన్షన్లు తొలగించేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. స్థానిక నాయకులు సముద్రాన్ని సైతం కబ్జా చేస్తుంటే అధికారులు మౌనంగా ఉండిపోతున్నారని విమర్శించారు. రేపల్లె ఇన్‌ఛార్జి ఈవూరి గణేష్ మాట్లాడుతూ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ మెంట్ ఇవ్వకపోవటంతో కళాశాల యాజమాన్యం హాల్ టిక్కెట్లు ఇవ్వలేని పరిస్థితి నెలకొందని అన్నారు. నిర్మాణంలో ఉన్న వైద్య కళాశాలలను పట్టించుకోక నిర్మాణ దశలోనే శిథిలావస్థకు చేరుతున్నాయని అన్నారు. వేమూరు ఇన్‌ఛార్జి వరికూటి అశోక్ బాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కోడిపందేలు, పేకాట స్థావరాలకు అనుమతులు ఇస్తుంది కానీ శాంతి యుతంగా నిరసన తెలిపేందుకు అనుమతి ఇవ్వడం లేదని అన్నారు. అనంతరం డిఆర్ఓ గంగాధర్ గౌడ్ కు వినతి పత్రం అందజేశా రు. వైసీపీ కార్యకర్తలు రథం బజార్ నుండి కలెక్టర్ కార్యాలయం వరకు ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి యువజన విభాగం జిల్లా అధ్యక్షులు కొక్కిలిగడ్డ చెంచయ్య, ఎంపిపి చన్నిపోతుల హరిబాబు, కాగిత సుధీర్ బాబు, కోకి రాఘవరెడ్డి, నక్కా వీరారెడ్డి, డి జయభారతరెడ్డి, చేజర్ల నారాయణరెడ్డి, వీరేంద్ర, జిల్లా ఉపాధ్యక్షులు కోడూరు ప్రసాదరెడ్డి, శంకర్రెడ్డి, దొంతిబోయిన సీతారామిరెడ్డి, షేక్ సయ్యద్ పీర్, శాయిల మురళి, చల్లా రామయ్య, దొంతిబోయిన ఏడుకొండలరెడ్డి, మధు, ఉరబిండి గోపినాథ్, రవితేజ, సాగర్, షేక్ మౌలాలి, గోపి, వడ్డిముక్కల డేవిడ్, జోగి రాజా, నర్రావుల వెంకట్రావు, మోర్ల సముద్రాలగౌడ్, గంగిశెట్టి రత్తయ్య పాల్గొన్నారు.

చీరాల : కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా యువతను మోసం చేస్తుందని వైసీపీ యువజన విభాగం జిల్ల ఉపాధ్యక్షులు కోడూరి ప్రసాదరెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచెందుకు యువత పోరు చేపట్టినట్లు చెప్పారు. వైసిపి అధినేత వైఎస్ జగన్మోహ న్‌రెడ్డి ఆదేశాల మేరకు వైసిపి చీరాల ఇంచార్జ్ కరణం వెంకటేష్ బాబు సూచనలతో యువజన విభాగం నాయకులు బాపట్ల కలెక్టర్ కార్యాలయంకు తరలి వెళ్ళి నిరసన తెలిపారు. కార్యక్రమంలో రాఘవ, హచ్ రమేష్, వసుమళ్ళ వాసు, డేవిడ్, విని శ్రీను, కౌన్సిలర్ బత్తుల అనిల్, అద్దంకి రెడ్డి, అంకాలరెడ్డి, ఉమా మహేశ్వరవు, కావూరి రమణారెడ్డి పాల్గొన్నారు.


వినతి పత్రం అందజేస్తున్న వైసీపీ యువజన నాయకులు


విద్యార్థిని శృతిని అభినందిస్తున్న మంత్రి లోకేష్

శృతిని అభినందించిన మంత్రి లోకేష్

ప్రజాశక్తి - పంగులూరు

చిన్న వయసులోనే యోగాసనాల్లో అత్యంత ప్రతిభ కనబరుస్తు గిన్నిస్ రికార్డులో స్థానం పొందిన చందలూరు ఉన్నత పాఠశావల విద్యార్థిని నాయపాము శృతిని మంత్రి లోకేష్ సోమవారం అభినందించారు. ఇంకొల్లు మండలం గంగవరంలో డివిఆర్ సైనిక్ స్కూల్ ప్రారంభోత్సవంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయనను శృతి ఆమె గురువు, చందలూరు హై స్కూల్ పిడి ప్రతిమ కలిశారు. ఈ సందర్భంగా లోకేష్ అభినందిస్తూ చదువుకొని ఏమి చేయాలనుకుంటున్నావని అడుగగా తాను ఉపాధ్యాయురాలిని కావాలని అనుకుంటున్నట్లు చెప్పింది. మంత్రులు గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్, శాసన సభ్యులు ఏలూరు సాంబశివరావు, నరేంద్ర వర్మ, డిఇఒ పురుషోత్తం, ఎంఇఒ శ్రీనివాసరావు, చందలూరు హైస్కూలు హెచ్‌ఎం చందలూరు గిరిజ పాల్గొన్నారు.


హెలిపాడ్‌కు స్థల పరిశీలన చేస్తున్న తహశీల్దారు

హెలీప్యాడ్ నిర్మాణానికి స్థల పరిశీలన

ప్రజాశక్తి - భట్టిప్రోలు

అత్యవసర పరిస్థితుల్లో, ప్రకృతి వైపరీత్యాలు సంభవించి ప్రజలు ఇబ్బందులు పడే పరిస్థితుల్లో వాటిని పరిశీలించేందుకు విచ్చేసేందుకు సిఎం, ఉన్నత స్థాయి నేతలు, అధికారుల హెలికాప్టర్ దిగేందుకు హెలీ ప్యాడ్ నిర్మాణానికి తహశీల్దారు మేకా శ్రీనివాసరావు, ఎంపిడిఒ ఎస్ వెంకట రమణ స్థలాన్ని సోమవారం పరిశీలించారు. స్థానిక మార్కెట్ యార్డ్ ఆవరణలో ఖాళీగా ఉన్న ప్రాంతాన్ని సర్వేయర్ శ్రీనివాసరావు ద్వారా కొలతలు కొలిచి హెలిపాడ్ నిర్మాణానికి కేటాయించారు. డెల్టా ప్రాంతంలో ప్రతిఏట అధిక వర్షాలు, కృష్ణా నది వరదలతో ప్రజలు పంటల దెబ్బతిని తీవ్రంగా నష్టాలను ఎదుర్కొంటున్నారని అన్నారు.

కాలేజీ విద్యార్థినులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - పంగులూరు


విద్యార్థినులకు పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న వడ్డవల్లి వీరనారాయణ

మండలంలోని బూదవాడలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల 2వ సంవత్సరం విద్యార్థినులకు అజిత్ కుమార్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వడ్డపల్లి వీరనారాయణ ఉచితంగా పాఠ్య పుస్తకాలను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుంటే మంచి భవిష్యత్తు ఉంటుందని అన్నారు. తద్వారా పాఠశాలకు, తల్లి, దండ్రులకు మంచి పేరు వస్తుందని అన్నారు. ప్రతి ఒక్కరూ చదువును ప్రోత్సహించాలని అన్నారు. చదువు ద్వారానే ఏదైనా సాధించవచ్చని అన్నారు. తనకు చదువుకునే విద్యార్థులు అంటే ఎంతో ఇష్టమని, అందుకే తమ ట్రస్ట్ ద్వారా ప్రతి ఏటా చదువు కోసం కొంత ఖర్చు చేస్తున్నానని చెప్పారు. ఆడపిల్లలు చదువుకుంటే ఆ కుటుంబాల్లోని పిల్లలు కూడా బాగా చదువుకుంటారని, కుటుంబాలను చక్కదిద్దుకుంటారని అన్నారు. ఈరోజు ఆడపిల్లలు అన్ని రంగాల్లోనూ ముందుంటున్నారని, చదువులోనూ మంచి స్థాయిలో ఉంటున్నారని చెప్పారు. చక్కగా చదువుకుని మంచి భవిష్యత్తును పొందాలని కోరారు. అనంతరం ఇంటర్ 2వ సంవత్సరం చదువుతున్న విద్యార్థినిలకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం పి రఘురామయ్య, ఉపాధ్యాయులు స్వర్ణ వెంకట దుర్గా వరప్రసాద్, జివిఆర్‌కె కిషోర్, ఎ ధనరాజ్, పి శ్రీనివాసరావు, ఐ చంద్రశేఖర్, కె పుల్లయ్య పాల్గొన్నారు.

ఏకలవ్య విగ్రహ నిర్మాణ దిమ్మ ధ్వంసం చేసిన వారిపై

అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

ప్రజాశక్తి - అమృతలూరు


విగ్రహ స్థలం పగలగొట్టిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న నాయకులు

స్థానిక ఎస్టి కాలనీ నందు పంచాయతీ తీర్మానంతో (ఎరుకుల) ఏకలవ్య విగ్రహం ఏర్పాటు చేయాలని నిర్ణయించగా దానికి సంబంధించిన విగ్రహం పిల్లర్స్ జెసిపితో ధ్వంసం చేయడమే కాక అడ్డు వచ్చిన ఎస్టీలను కులం పేరుతో దూషించిన వ్యక్తిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఎరుకుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎన్ మోహన్ కుమార్ ధర్మ డిమాండ్ చేశారు. దిమ్మెలను పగలగొట్టిన అగ్రకులానికి చెందిన నార్ల ప్రసాదుపై పోలీసు స్టేషన్లో సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ తీర్మానంతో విగ్రహ నిర్మాణానికి ఏర్పాట్లు చేసుకుని పిల్లర్లను సిద్ధం చేయగా వాటిని అక్రమంగా నార్ల ప్రసాదు అనే వ్యక్తి దోషం చేయడం పంచాయతీ తీర్మానాన్ని అవహేళన చేసినట్లేనని అన్నారు. అంతటితో ఆగకుండా కులం పేరుతో దుర్భాషలాడి ఎస్టీలపై దౌర్జన్యం చేసి అవమానపర్చడని ఫిర్యాదులో పేర్కొన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అమృతలూరు, అంగలకుదురు సర్పంచులు దేవరకొండ రాము, ఊసువర్తి సుబ్బారావు, అమృతలూరు మాజీ సర్పంచ్ దేవరకొండ వీరయ్య, వైహెచ్‌పిఎస్ యువజన అధ్యక్షులు మొగల్ ప్రతాప్ కుమార్, దేవరకొండ వసంతరావు, వల్లాగి కిరణ్, పాలపర్తి సూర్య ప్రకాష్, మూకిరి శ్రీనివాసరావు, దేవరకొండ రాంబాబు, దేవరకొండ రామకృష్ణ, దేవరకొండ రత్తయ్య, దేవరకొండ శేషగిరి, వెంకట రత్నం, మూకిరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రామకూరులో బెల్ట్ షాపుపై దాడి

ప్రజాశక్తి - పంగులూరు


ఎస్ఐ హర్షవర్ధన్‌రెడ్డి

మండలంలోని రామకూరు గ్రామంలోని బెల్ట్ షాపుపై దాడి చేసి ఎనిమిది మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకున్నట్లు అద్దంకి ఎక్సైజ్ ఎస్ఐ హర్షవర్ధన్‌రెడ్డి సోమవారం తెలిపారు. బెల్ట్ షాపు నిర్వహిస్తున్న షేక్ ఖోరేషపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అంతకు ముందు మండలంలోని బైటమంజులూరులో దాడులు చేశామని, ఎటువంటి అక్రమ మద్యం లభించలేదని తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది, గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శి పాల్గొన్నారు.

రెవెన్యూ ఆధారిత భూమి సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - ఇంకొల్లు

స్థానిక డివిఆర్ సైనిక పాఠశాల ప్రారంభోత్సవానికి వచ్చిన రెవెన్యూ మంత్రి అనగాని సత్య ప్రసాద్‌కు అపరిష్కృతంగా ఉన్న రెవెన్యూ సంబంధిత సమస్యలు పరిష్కరించాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కందిమల్ల రామకోటేశ్వరరావు, మరి కొంత మంది రైతులతో కలిసి వినతి పత్రం అందజేశారు. గత ప్రభుత్వం కానీ, అంతకు ముందు కానీ భూముల రీ సర్వే పేరిట చేసిన సర్వేలో అన్నీ తప్పులే ఉన్నాయని తెలిపారు. భూమి కంప్యూటీకరణ పేరుతో ఆన్లైన్లోనూ, వెబ్ లాండ్‌లోను తప్పులు ఉండటంతో వ్యవసాయ రుణాలు పొందటానికి, పొలాలు రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి, తల్లికి వందనం సొమ్ములు పొందటానికి కొంతమంది ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రెవెన్యూ సంబంధిత భూ సమస్యలు పరిష్కరించాలని కోరారు. రెవిన్యూ, సచివాలయాల వద్దకు వెళితే సర్వేయర్లు, విఆర్ఒలు తప్పులు సరి చేయకుండా కాలయాపన చేస్తూ సాకులు చెబుతున్నారని అన్నారు. చలానాలు తీయడంతో పాటు అధిక మొత్తంలో లంచం డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం పరిశీలించి గత ప్రభుత్వం చేసిన తప్పులు తడకగా ఉన్న ఆన్లైన్ సర్వేను పూర్తిగా రద్దు చేయాలని కోరారు. రైతులు ఎవరి భూమిలో వారు ఉన్నారని, ఎలాంటి చలానాలు లేకుండా గత భూ రికార్డులు, రైతులు వద్ద ఉన్న భూమికి సంబంధించిన పత్రాలు పరిశీలించి సర్వే నెంబర్లు కేటాయించి రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరారు.

మిషన్ వాత్సల్యకు దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి - సంతమాగులూరు

మిషన్ వాత్సల్య కార్యక్రమానికి సంబంధించి మహిళా అభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు 0 నుండి 18 ఏళ్ల వయస్సు గల అర్హులైన పిల్లల నుండి కొత్తగా ధరకాస్తులు స్వీకరిస్తున్నట్లు సంతమాగులూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఓ డి సుధ తెలిపారు. ఇప్పటివరకు ఈ ప్రాజెక్టు పరిధిలో అర్హులైన 25 మంది పిల్లలకు నెలకు రూ.4 వేల చొప్పున పిల్లల విద్య, పోషణ అవసరాలకు అనుగుణంగా అందిస్తున్నట్లు తెలిపారు. కొత్త ధరకాస్తుల్లో అనాథ పిల్లలకు మొదటి ప్రాధాన్యత, హెచ్‌ఐవి బాధిత, ప్రభావిత పిల్లలు, భర్త చనిపోయి కుటుంబాన్ని పోషిస్తున్న మహిళల పిల్లలకు, ఇతర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారి పిల్లలకు ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉందని అన్నారు. అర్హత కలిగిన పిల్లలు వారి ఆధార్, తల్లి, దండ్రుల ఆధార్, పిల్లవాని బ్యాంకు పాస్ పుస్తకం లేదా పిల్లవాడు, తల్లి గాని, తండ్రి గాని లేదా సంరక్షునితో కలిపి ఉన్న జాయింట్ బ్యాంకు ఎకౌంటు పాస్ పుస్తకం, రేషన్ కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, తల్లి లేదా తండ్రి మరణిస్తే మరణానికి సంబంధించిన కారణం, మరణ ధ్రువీకరణ పత్రం, పిల్లవాని విద్యార్హత, పాస్ పోర్ట్ సైజు ఫోటోతో కలిపి మూడు సెట్లు జిరాక్స్ పత్రాలు అంగన్‌వాడి కార్యకర్తకు అందచేయాలని తెలిపారు. ఒక కుటుంబం నుంచి ఒక్కరిని మాత్రమే తీసుకోవాలని అన్నారు. రెసిడెన్షియల్ స్కూల్స్, కాలేజీల్లో చదువుతున్న పిల్లలు అనర్హులని తెలిపారు. అర్హత గల అభ్యర్థుల దరఖాస్తులు రెండు రోజుల్లో సమర్పించాలని కోరారు.



సభలో పాల్గొన్న కలెక్టర్, మంత్రులు, ఎమ్మెల్యే

సుపరిపాలన సభలో కలెక్టర్, మంత్రులు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

అమరావతిలో జరిగిన సుపరిపాలన–తొలి అడుగు సభలో కలెక్టర్ జె.వెంకటమురళి పాల్గొన్నారు. సభకు మంత్రులు గొట్టిపాటి రవి కుమార్, అనగాని సత్యప్రసాద్, ఎంపీ తేనేటి కష్ణ ప్రసాద్, బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మరాజు, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు హాజరయ్యారు.

మంత్రి లోకేష్‌ను కలిసిన రవికుమార్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్



లోకేష్‌ను కలిసిన రవికుమార్

బాపట్ల జిల్లా, ఇంకొల్లులో డివిఆర్ సైనిక్ స్కూల్ ప్రారంభోత్స వానికి వచ్చిన రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్‌ను శ్రీ హర్షిణి విద్యాసంస్థల చైర్మన్ గోరం ట్ల రవికుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ పుష్ప గుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ప్రకాశం జిల్లాలో మొట్ట మొదటిసారిగా శ్రీ హర్షిణి మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటుకు సహకరించిన మంత్రి నారా లోకేష్‌కు గో రంట్ల రవికుమార్ ధన్యవాదాలు తెలియజేశారు.



ప్రజల సమస్యలు వింటున్న కలెక్టర్ అన్సారియా

అర్జీల సత్వర పరిష్కారానికి కృషి

కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)వేదికలో అందిన అర్జీల సత్వర పరిష్కారమే లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. సోమవారం ఒంగోలు కలెక్టరేట్ లోని మీ కోసం సమావేశ మందిరంలో నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో ఎటువంటి జాప్యానికి తావులేకుండా నాణ్యతతో పరిష్కరించాలన్నారు. అర్జీదారుని సంతృప్తే ధ్యేయంగా అర్జీల పరిష్కారతీరు వుండాలని స్పష్టం చేశారు. అర్జీలు రీ–ఓపెన్ కాకుండా పరిష్కార చర్యలు ఉండాలన్నారు. ఫిర్యాదుదారులతో ముఖాముఖీగా మాట్లాడి ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకుని పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. జిల్లా అధికారులు వారి శాఖలకు సంబంధించిన అర్జీలను క్షుణంగా పరిశీలించి తమ సిబ్బందితో నిర్ణీత గడువులోగా త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి బి.చిన ఓబులేసు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వరకుమార్, శ్రీధర్, జాన్సన్, కుమార్, వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మత్స్యకారులపై కేసులు పెట్టడం దుర్మార్గం

- కేసులను తక్షణమే ఎత్తివేయాలి
- ఏపీ మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం డిమాండ్
- నేడు బాపట్ల కలెక్టర్ కార్యాలయం వద్ద మత్స్యకారుల ధర్నా



మత్స్యకారులతో మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి-చీరాల, బాపట్ల జిల్లా

మత్స్యకారులు బోట్లు నిలుపుదల చేసుకునే సీమౌత్ కాలువ అన్యాక్రాంతం అవుతుందని అధికారులను ప్రశ్నించినందుకు వారి సమస్యను పరిష్కరించకుండా మత్స్యకారులపైనే కేసులు పెట్టడం తగదని, మత్స్యకారులకు తక్షణమే న్యాయం జరిగే విధంగా ఈపురుపాలెం స్ట్రెయిట్ కట్ కాలువను పూర్వంలో ఉన్నట్టు యథాతదంగా ఏర్పాటు చేసి ప్రభుత్వమే తవ్వించి ఇవ్వాలని ప్రజాసంఘాల నాయకుడు నలతోటి బాబూరావు డిమాండ్ చేశారు. సోమవారం వాడరేవు తుపాను షెల్టర్ వద్ద మత్స్యకారుల సంఘం నాయకులు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకొని మాట్లాడారు. కాలువ సముద్రంలో కలిసినచోట ఎల్ ఆకారంలో ఉండటం వల్ల సైక్లోను, ఉప్పెన అలలు తాకిడికి బోట్లు పగిలిపోకుండా మరియు రాపిడికి, అగ్నిప్రమాదం జరగకుండా రక్షణగా ఉన్నటువంటి సీ మౌత్ ను రాజకీయ అండదండలతో బుర్ల వెంకట్రావు సిఆర్ జెడ్ పరిధిలో కాల్వకు ఆనుకొని రిసార్ట్ కట్టడం జరిగిందని ఆంధ్రప్రదేశ్ మత్స్య కారులు, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొల్లాటి శ్రీనివాసరావు అన్నారు. బాపట్ల, చీరాల నియోజకవర్గ పరిధిలో ఉన్న 12 మత్స్యకార గ్రామాల్లో 12 వేల మంది సముద్రంలో నిరంతరం చేపల వేట చేస్తున్నారని, వేట అనంతరం బోట్లను ఈపురుపాలెం స్ట్రెయిట్ కట్ కాలువలో సీ మౌత్ లో నిలుపుదల చేసుకుంటారన్నారు. రిసార్ట్‌కు వస్తున్న టూరిస్టులకు సముద్రంలో స్నానం చేయటానికి అడ్డుగా ఉన్నందున ఈపూరుపాలెం స్ట్రెయిట్ కట్ కాల్వ పక్కనే ఉన్న ఇసుక తేన్నెలతో పూడ్చివేసి కాల్వ యొక్క నీటి ప్రవాహాన్ని నేరుగా సముద్రంలోకి వెళ్లేటట్లు సీ మౌత్ స్వరూపాన్ని మార్చి వేశారన్నారు. సిఆర్‌జెడ్ పరిధి దాటి సముద్ర కెరటాల అంచు వరకు మొత్తం సీ మౌత్ 1000 మీటర్లు కాలువ ఇరిగేషన్ భూమిని ఆక్రమించి మత్స్యకారులకు బోట్లు వెళ్లనివ్వకుండా అడ్డుకట్ట వేసి దుర్మార్గమైన చర్యలు చేపట్టిన బూర్ల వెంకటరావు పై చర్యలు తీసుకోవాలని మత్స్యకారులు వారం రోజులుగా ఆందోళన చేస్తుంటే స్థానిక పోలీస్, రెవెన్యూ అధికారులు కబ్జాదారుతో సిండికేట్ అయ్యి.. మత్స్యకారులపై అక్రమ కేసులు పెట్టడం, భయభ్రాంతులకు గురి చేయడం, మత్స్యకారుల హక్కులను తుంగలో తొక్కి.. మత్స్యకారులను వేధించటం దుర్మార్గమన్నారు. అయితే బుర్ల వెంకట్రావు 57 సెంట్లు భూమిని వేరే వ్యక్తి వద్ద కొన్నారని, దానికి సంబంధించిన ఆధారాలు ఉన్నాయని తన భూమి సముద్రంలో కొట్టుకుపోయిందని అందుకనే ఈపురుపాలెం కాలువను ఆక్రమించుకోమని రెవెన్యూ అధికారులు చెప్పారని ఆయన మీడియాతో మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతనే పథకం ప్రకారం ఆన్లైన్ చేయించారని అర్థమవుతుందన్నారు. ప్రస్తుతం ఉన్న రిసార్ట్‌కు విద్యుత్ సౌకర్యం లేనందున విద్యుత్ అధికారులు ఇవ్వకపోతే హైకోర్టుకు ద్వారా పర్మిషన్ తెచ్చుకున్న తర్వాతనే విద్యుత్ కనెక్షన్ ఇవ్వటం జరిగిందన్నారు. కోస్టల్ రెగ్యులేటరీ అథారిటీ వారి నిబంధనల మేరకు ఎటువంటి అభివద్ధి కార్యకలాపాలు నిర్వహించకూడదన్న నిబంధన ఉండగా బుర్ల వెంకట్రావు ఎటువంటి రెవెన్యూ, రిజర్వ్ ఫారెస్ట్, పర్యావరణ పర్మిషన్ లెటర్స్ ఏమీ లేకుండా ఈపూరుపాలెం స్ట్రెయిట్ కట్ ఇరిగేషన్ కాలువను దారి మళ్లించడం లేదా భూస్వరూపాన్ని మార్చడం చట్ట వ్యతిరేకమన్నారు. ఈ డిమాండ్ల కోసం ఈ నెల 24న బాపట్ల జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా జరుగుతుందని ఈపూరుపాలెం స్ట్రెయిట్ కట్ మొగ పునరుద్ధరణ సాధన సమితి కన్వీనర్ ఏరిపిల్లి రమణ, సభ్యులు రాంబాబు అన్నారు. ఈ సమస్యను పరిష్కరించకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మత్స్యకారులను ఐక్యం చేసి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

కాంగ్రెస్‌కు పూర్వవైభవం వచ్చేనా.?

- నేడు వైఎస్ షర్మిలరెడ్డి ఒంగోలు రాక
- పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో దిశానిర్దేశం



ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

పిసిసి అధ్యక్షురాలుగా వైఎస్ షర్మిల కాంగ్రెస్ పార్టీ పూర్వ వైభవం దిశగా కృషి చేస్తున్నారు. ఈ క్రమంలో రాష్ట్ర పర్యటన చేపట్టిన ఆమె మంగళవారం ప్రకాశం జిల్లా కేంద్రమైన ఒంగోలు రానున్నారు. ఒంగోలు పిఏజి కన్వెన్షన్ హాలులో జరిగే జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ఆమె పాల్గొని భవిష్యత్తులో చేపట్టాల్సిన ఉద్యమాలపై దిశా నిర్ధేశం చేయనున్నారు. పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిలరెడ్డి జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం మధ్యాహ్నం రెండు గంటలకు నెల్లూరు నుండి బయలుదేరి జిల్లా కేంద్రమైన ఒంగోలు రానున్నారు. ఆమె రాకను పురస్కరించుకొని ఒంగోలులో పార్టీ నాయకులు పెద్ద ఎత్తున ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఒంగోలు సంఘమిత్ర హాస్పిటల్ కూడలి నుండి రామ్ నగర్ ,నెల్లూరు బస్టాండ్, కలెక్టర్ కార్యాలయం, చర్చి సెంటర్, మిరియాల పాలెం సెంటర్, ట్రంక్ రోడ్, మస్తాన్ దర్గా సెంటర్, బాపూజీ కాంప్లెక్స్, అద్దంకి బస్టాండ్ మీదుగా, గుంటూరు రోడ్‌లోని పిఏజి కన్వెన్షన్ సెంటర్ కు చేరుకుంటారు. చర్చి సెంటర్‌లో స్వర్గీయ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తారు. స్థానిక గుంటూరు రోడ్ లోని పిఏజి కన్వెన్షన్ హాల్ లో జిల్లా విస్తతస్థాయి సమావేశంలో పాల్గొని పార్టీ సంస్థాగత నిర్మాణంపై చర్చ జరిపి నాయకులకు నిర్దేశం చేయనున్నారు. జిల్లాలో వివిధ ప్రజా సమస్యలపై పూర్తిస్థాయిలో చర్చించి తీర్మానాలు చేయనున్నారు. భవిష్యత్తులో సమస్యలు పరిష్కారం కోసం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టనున్నారు.

పర్యటనను జయప్రదం చేయండి

- బిఆర్ గౌస్, సయ్యద్ జావీద్ అన్వర్

పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి మంగళవారం జిల్లా పర్యటనను జయప్రదం చేయాలని ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ కోఆర్డినేటర్ బిఆర్ గౌస్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు సయ్యద్ జావీద్ అన్వర్ కోరారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం, సంస్థాగత నిర్మాణం, భవిష్యత్తు ఉద్యమాలపై పిసిసి అధ్యక్షురాలు దిశా నిర్ధేశం చేస్తారన్నారు. ఒంగోలులో జరిగే కాంగ్రెస్ పార్టీ జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో కాంగ్రెస్ పార్టీ, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొని పర్యటనను విజయవంతం చేయాలని వారు కోరారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

'చలో తెనాలి' కరపత్రాల ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

తెనాలి లో దళిత యువకుల పై పోలీస్ దాష్టికానికి నిరసనగా ఈనెల 28న జరిగే చలో తెనాలి కార్యక్రమం కరపత్రాలను దళిత నాయుకులు ఆవిష్కరించారు. ఒంగోలు మల్లయ్యలింగం భవన్ లో సోమవారం దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కరవది సుబ్బారావు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి బి.రఘురామ్ మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దారా అంజయ్య, న్యాయవాది రాఘవలు, మాల సంఘాల జెఎసి చైర్మన్ కొప్పోలు ఏడుకొండలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్ర రావు మాట్లాడు తెనాలి దళిత యువకులపై పోలీస్ అమానుష దాడి ఘటనలో పోలీసులను కనీసం బదిలీ చేయలేదన్నారు. రాష్ట్ర హెూం శాఖ మంత్రి అనిత పోలీస్ కొడితే తప్పేంటని తెనాలి పోలీస్ చట్ట విరుద్ధంపై బహిరంగంగా వీడియోలో మాట్లాడటం కూటమి ప్రభుత్వ కుటిల నీతికి నిదర్శనమన్నారు. ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్ ఇంతవరకు తెనాలి దళిత మానవ హక్కుల ఉల్లంఘనపై స్పందించలేదన్నారు. తెనాలి దళిత యువకుల పై పోలీస్ దాష్టికానికి నిరసన గా తెనాలి టూ టౌన్ సిఐ రాములు నాయక్, త్రి టౌన్ సిఐ రమేష్ బాబులను ఎస్సీ ఎస్టీ కేసు ప్రకారం అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. హెూమ్ మంత్రి అనిత దళిత జాతికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమం లో జై భీమ్ రావు భారత్ పార్టీ అధ్యక్షులు రామలింగం, పాటిబండ్ల సిద్దయ్య, వై శివారెడ్డి, మల్లికార్జునరావు పాల్గొన్నారు.

లోకేష్‌ను కలిసిన ప్రజాప్రతినిధులు



ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

బాపట్ల జిల్లా ఇంకొల్లులో డివిఆర్ సైనిక్ స్కూల్ ప్రారంభోత్సవానికి వచ్చిన రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్‌ను ప్రకాశం జిల్లాకుచెందిన ప్రజాప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి నారా లోకేష్ జిల్లా ప్రజాప్రతినిధులను ఆత్మీయంగా పలకరించి కరచాలనం చేశారు. ఈ సందర్భంగా తొలి ఏడాది పాలనపై ఆయన ప్రజాప్రతినిధులతో ముచ్చటించారు.